J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 18 04.10.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## మోగుతున్న ప్రమాద ఘంటికలు

# మూడో ప్రపంచ యుద్ధానికి సంకేతాలు

- దాడులతో దద్ధరిల్లుతున్న పశ్చిమాసియా
- ఉగ్రరూపం దాల్చిన ఇరాన్ - ఇజ్రాయెల్ పోరు

**పశ్చిమాసియాలో తీవ్ర యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల దాడితో ఆ ప్రాంతం అగ్నిగుండంలా మారింది. ఓ పక్క రష్యా-ఉక్రెయిన్ల మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉండగా, మరోపక్క పశ్చిమాసియాలో తీవ్ర యుద్ధవాతావరణం ఏర్పడడం ప్రపంచాన్ని కలవరపెడుతోంది.**

ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు మానుకోవాలని భారతీయులకి కేంద్ర ప్రభుత్వం సూచించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లో ఉన్న తెలుగువారి భద్రత పట్ల ఇక్కడి కుటుంబాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే, తామంతా బంకర్లలో సురక్షితంగానే ఉన్నామని వారు తమ కుటుంబసభ్యులకు వాట్సప్ ద్వారా మెసేజ్‌లు ఇస్తున్నట్లు కొంతమంది చెప్తున్నారు.

చరిత్ర తిరగేస్తే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తొలుత సత్సంబంధాలే ఉండేవి. 1953 నుంచి 1979 వరకు ఫలావి వంశం ఇరాన్‌ను పరిపాలించింది. ఆ వంశానికి చెందిన మహ్మద్ రెజా ఫలావి ఇరాన్‌కు షాగా, అంటే చక్రవర్తిగా ఉండేవారు. ఆ సమయంలో రెండు దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగాయి. ఉమ్మడి శత్రువుగా భావించిన ఇరాక్ విషయంలో కలిసికట్టుగా పనిచేసేవారు. 1979లో ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్స్ షాను గద్దె దింపి అతివాద నేత అయితుల్లా ఖొమైనీ ఏలుబడిలోకి వచ్చిన తర్వాత నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు సజావుగా సాగలేదు. అయితే ఇరాక్ పట్ల రెండు దేశాలకు వ్యతిరేకత ఉండడంతో ఆ విషయంలో

10 లో

# నెయ్యి తీసిన గొయ్యి

## లడ్డూలా దొరికేదెవరో?

- సుప్రీంకి చేరిన తగువు
- దేవుళ్లని రాజకీయాల్లోకి లాగొద్దని హితవు



**కలియుగ ప్రత్యక్ష దైవం.. సాక్షాత్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి నెయ్యి వివాదం క్రమేణా అనేక మలుపులు తీసుకుంటోంది. కొన్ని కోట్లమంది భక్తుల మనోభావాలకి సంబంధించిన అంశానికి అంటుకున్న రాజకీయ 'మకిలి'ని కడగడానికి అత్యున్నత న్యాయస్థానం నడుం బిగించింది. నకిలీ నెయ్యి విషయంలో ఆధారాలతో ఆరోపణలు చేయాలంటూ హితవుపలికింది. మొన్న సెప్టెంబర్ 30 సోమవారం నాడు ఈ అంశానికి సంబంధించి అనేక అనుమానాలని లేవనెత్తుతూ అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది.**

3 లో

# ఉత్తరక్రియలు



సౌమ్యశీలి, సహనశీలి, స్నేహశీలి
ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపిన దానశీలి
మాగుంట ఇంటి దీపం, మా పెద్ద దిక్కు
స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి గారి సతీమణి

## శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు

మాజీ పార్లమెంటు సభ్యురాలు, మాజీ శాసనసభ్యురాలు
సెప్టెంబర్ 25, 2024న స్వర్గస్తురాలైనారు.
వారి దివ్య ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

| | |
|---|---|
| సుమాలిని - శివకుమార్‌రెడ్డి | గీతాలత - శ్రీనివాసులురెడ్డి |
| మమతారెడ్డి | స్నేహలతారెడ్డి |
| అనన్య - అనిష్ | సుహాసిని - మధుసూదన్‌రెడ్డి |
| దీప్తి - గౌతమ్‌రెడ్డి | చందన - రాఘవ్‌రెడ్డి |
| స్వాతి - కిరణ్‌రెడ్డి | నిఖిల్ |

**మాగుంట సుబ్బరామ్‌రెడ్డి**

మరియు మాగుంట కుటుంబం

జననం : 27.07.1947 నిర్యాణం : 25.09.2024

**పెద్ద కర్మ : తేది 09.10.2024 బుధవారం ఉదయం 11.30 గంటలకు నెల్లూరు, సరస్వతీనగర్‌లోని 'మాగుంట నివాసం' నందు జరుగును.**

# గుండెవ్యాధుల నివారణపై 'అపోలో' ర్యాలీ



మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల గుండెసంబంధిత వ్యాధులు ఎక్కువవు తున్నాయని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా గుండెవ్యాధుల పట్ల అందరూ అవగాహన కలిగించుకుని తగు వైద్యపరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చెప్పారు. ప్రపంచ గుండెవ్యాధుల నివారణ దినం సందర్భంగా సెప్టెంబరు 29న స్థానిక అపోలో ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఈ కార్యక్రమానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, గుండె ఆరోగ్యంగా ఉండేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, మానసిక వత్తిడులకు దూరంగా ఉండాలని సూచించారు. 24 గంటలూ పోలీసు సిబ్బంది ఒత్తిడిని ఎదుర్కొంటుంటారని, ఒత్తిడి వల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. పోలీసులందరూ ఏడాదికోసారి పూర్తిస్థాయిలో చెకప్ చేయించుకోవాలని, అందుకు నెల్లూరు అపోలో హాస్పిటల్ వారు సహకారం అందిస్తుండడం అభినందనీయమని అన్నారు. అనంతరం, పోలీసు సిబ్బందికి నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. అపోలో ఆసుపత్రి వద్ద నుంచి జిల్లా పోలీసు కార్యాలయం వరకు జరిగిన వాక్‌థాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, పోలీసులకు గుండె వ్యాధుల నివారణ పట్ల అవగాహన కలిగించారు. ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, శంకరయ్య, అపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చిరా భక్తవత్సలరెడ్డి, సర్జన్ డాక్టర్ విజ్ఞచరణ్, డాక్టర్ షర్మిల, డాక్టర్ నాగభూషణం, పోలీస్ యూనిట్ అధికారి డాక్టర్ అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

## అధికారులకు కలెక్టర్ ఆదేశం



జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం క్రింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులు ఆదేశించారు. ఇటీవల నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్‌హాల్‌లో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటిపారుదల పథకం క్రింద ఉద్యాన పంటలకు మైక్రో ఇరిగేషన్ సౌకర్యం కల్పించడానికి తీసుకోవలసిన చర్యలపై మైక్రో ఇరిగేషన్ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాదికి10,500 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని. అయితే ఇప్పటివరకు 8,161 హెక్టార్ల భూములను రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని, జిల్లాలో మైక్రో ఇరిగేషన్ అధికారులు 1523 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అందించడానికి ప్రాథమిక తనిఖీలు చేపట్టాయని ఆయన చెప్పారు. జిల్లాలో 147 మంది రైతులకు సంబంధించి 240 హెక్టార్లలో ఉద్యాన పంటలకు మైక్రో ఇరిగేషన్ సౌకర్యం అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. మైక్రో ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులు, ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను త్వరితగతిని పూర్తిచేయడానికి ప్రణాళికలు తయారుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ 'మెగా రక్తదాన శిబిరం'



భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 29న డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరు శెట్టిగుంటరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ ప్రారంభించి మాట్లాడుతూ, రక్తదానమంటే ప్రాణదానమేనన్నారు. ఈ సందర్భంగా రక్తదాతలైన యువకులు 150 యూనిట్ల రక్తదానం చేయడంతో, ఆయన వారిని అభినందించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రమణ, కార్యదర్శి నరసింహ, ఎస్ఎఫ్ఐ నాయకుడు నరేంద్ర, నాయకులు కత్తి శ్రీనివాసులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జొన్నవాడలో

# జనసేన శాంతి హోమం

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూ కల్తీ అపచారం జరిగిం దంటూ, అందుకు ప్రాయశ్చిత్తంగా నెల్లూరులోని జనసేన నాయకుడు నూనె మల్లికార్జున్‌యాదవ్ ఆధ్వర్యంలో జొన్న వాడ దేవాలయంలో ప్రత్యేకపూజలు, శాంతి హోమం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్ద తుగా ఆయన ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ, మన సనాతన ధర్మాన్ని అం దరూ పరిరక్షించుకోవాలన్నారు. జనసేన నాయకులు సుందరరామిరెడ్డి, గునుకుల కిషోర్, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, న్యాయవాది శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలకొండ దేవాలయానికి..

# 7 లక్షల రాబడి



కందుకూరు నియోజకవర్గం వలేటి వారిపాలెం మండలం మాలకొండలోని దివ్యక్షేత్రం.. శ్రీ మల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి 7,04,120 రూపా యలు ఆదాయం వచ్చింది. ఇటీవల స్వామివారి హుండీలను లెక్కించగా, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా, ఇతరత్రా సేవల టిక్కెట్ల విక్రయం ద్వారా ఆమేరకు రాబడి వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

## టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్..

# కొత్త కార్యవర్గం



ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లాశాఖను సెప్టెంబరు 29న నెల్లూరులోని రహదారుల భవనాల శాఖ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా పి.మునెయ్య (తెలుగుగంగ ప్రాజెక్టు), కార్యదర్శిగా కె.కుమార్ (రహదారులు భవనాలశాఖ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా, కార్యనిర్వాహక అధ్యక్షునిగా కె.విజయకుమార్ (నీటిపారుదలశాఖ), కార్యనిర్వాహక కార్యదర్శిగా జీవీఎస్ రవి కుమార్ (రహదారులు భవనాలశాఖ), ఆర్థిక కార్యదర్శిగా జి.మధుసూదన్ (సోమశిల ప్రాజెక్టు) ఎన్నికయ్యారు. మరో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు సంయుక్త కార్యదర్శులు కూడా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎం.నాగప్రసాద్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రవికుమార్‌లు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అనంతరం, జిల్లా మాజీ అధ్యక్షుడు రాఘవ విశ్వనాథం, కార్యదర్శి కృష్ణారావులను నూతన కార్యవర్గం వారు ఘనంగా సన్మానించారు.

# వీఎస్‌యులో పర్యాటక దినోత్సవ వేడుకలు




నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యు)లో సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, సాంస్కృతిక మార్పులపై, సామాజిక స్థిరత్వంపై పడే ప్రభావాన్ని వివరించారు. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయని, సుస్థిర పర్యాటకం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదం చేస్తున్నదని చెప్పారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లా డుతూ, విద్యార్థులు టూరిజం రంగంలో తమ ప్రతిభను మెరుగుపర్చుకుని సమాజానికి సేవలందించాలని సూచించారు. వీఎస్‌యు కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.విజయ, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కోట నీల మణికంఠ, ఆచార్య కెవిఎస్ఎన్ జవహర్‌బాబు, డాక్టర్ ఎం. త్యాగరాజు, డాక్టర్ పి.సుజాత, డాక్టర్ జె.విజేత, ఎం.విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

# చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



నెల్లూరులోని కొండాయపాలెంలో ఉన్న నగర పాలక ప్రాథమిక పాఠశాలలో సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఉషాకిరణ్ పాల్గొని, పర్యాటక దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. సూపరింటెండెంట్ మురళీకృష్ణ సహకారంతో పాఠశాలకు మూడు సీలింగ్ ఫ్యాన్లను తమ వితరణగా అందజేశారు. మల్లెల శ్రీనివాసులు, జయేంద్ర, ఉపాధ్యాయులు హరీష్, రాశి తదితరులు పాల్గొన్నారు

# కన్యకాపరమేశ్వరి ఆలయానికి..నవరాత్రి శోభ



ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం.. నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం నవరాత్రి శోభతో కళకళలాడుతోంది. ఈ నెల 3 నుంచి అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 3వ తేదీ ఉదయం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో అమ్మవారిని నేత్రపర్వంగా అలంకరించి పెద్దఎత్తున పూజలు చేస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేకంగా మూలవర్లకు అలంకారాలు కనువిందుగా నిర్వహిస్తున్నారు. ఈసారి మరింత వైభవంగా 11 రోజుల పాటు అమ్మవారికి పూజలు, సేవలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు శేగు షణ్ముగరావు, దేవస్థానం గౌరవాధ్యక్షులు కొండా ప్రవీణ్‌శంకర్, అధ్యక్షులు కోట గురుబ్రహ్మం, గౌరవ సలహాదారు ఎంపీ ఆంజనేయులు, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌నావు, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా, 4న బాలా త్రిపుర సుందరి అలంకారం, మూలవర్లకు చందనాలంకారం జరిగాయి. 5న అన్నపూర్ణ అలంకారం, 6న శ్రీ రాజరాజేశ్వరి అలంకారం, మూలవర్లకు లక్ష గాజులతో అలంకారం, అదేవిధంగా, 7న గాయత్రీ అలంకారం, ముత్యాలచీరతో అలంకారం, పూలంగిసేవ, 8న ధనలక్ష్మి అలంకారం, నాణేలతో అలంకారం నిర్వహిస్తారు. 9న సరస్వతీదేవి అలంకారంతో పాటు మూలవర్లకు పుస్తకాలు, పెన్‌లతో అలంకారం ఉంటుంది. 10న దుర్గాదేవి అలంకారంతో పాటు, మూలవర్లకు కుంకుమ, సాయంత్రం నిమ్మకాయలతో అలంకారాలు చేస్తారు. 11న మహర్నవమి సందర్భంగా కన్యపూజ, గజలక్ష్మి అలంకారం, మూలవర్లకు మహిషాసురమర్దిని అలంకారం, పూలంగిసేవ, మూలవర్లకు చెరుకుతో అలంకారం నిర్వహిస్తారు. 12న విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శమీపూజ, మూలవర్లకు పూలంగిసేవ, అనంతరం నగరోత్సవం వైభవోపేతంగా ఉంటాయి. 13న వసంతోత్సవం, దర్బార్ అలంకారం, మూలవర్లకు మల్లెలతో అలంకారం నిర్వహించ నున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరిస్తున్నారు.

# నెయ్యి తీసిన గొయ్యి

(మొదటిపేజీ తరువాయి)

"నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్లు మీదగ్గర ఆధారాలు ఉన్నాయా...?"

"అదే నెయ్యితో లడ్డు తయారుచేశారని రుజువు చేయగలరా...?"

"నెయ్యిలో కల్తీ విషయమై జులై నెలలో నివేదిక వస్తే.. సెప్టెంబర్ 18 వరకూ ఎందుకు స్పందించలేదు...?"

"కల్తీ జరిగిందని మీదగ్గర రుజువులు, సాక్ష్యాలు ఉంటే మళ్ళీ దర్యాప్తు కోసం 'సిట్' ఎందుకు నియమించారు...?"

అంటూ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కే.వీ.విశ్వనాథంతో కూడిన ధర్మాసనం ఘాటుగా స్పందించింది. "ఆధారాలు లేకుండా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులు మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం మంచి సంప్రదాయం కాదంటూ" చురకలు అంటించింది. "రాజకీయాల నుండి దేవుళ్ళనైనా మినహాయించండి" అంటూ సలహా ఇచ్చింది.

ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే కొనసాగించాలా..? లేక స్వతంత్ర సంస్థ చేత దర్యాప్తు చేయించాలా అన్న విషయమై కేంద్ర ప్రభుత్వ వైఖరి తెలుసుకుని స్పందించవలసిందిగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాని కోరింది. అక్టోబర్ 3వ తేదీ గురువారం నాడు ఈ వివాదానికి సంబంధించిన విచారణపై స్పష్టత ఇస్తామని ప్రకటించింది. అయితే, గురువారం మధ్యాహ్నం విచారణ ప్రారంభించగానే ఈ విషయమై నిర్ణయం ప్రకటించడానికి మరోరోజు సమయం కావాలని సొలిసిటర్ జనరల్ అడగడంతో శుక్రవారం ఉదయం10.30 వరకు వాయిదా వేశారు.

## అయోమయంలో కూటమి..!

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కుటుంబ సమేతంగా తిరుమల సందర్శించిన పక్కరోజే అత్యున్నత న్యాయస్థానం కల్తీ నెయ్యి విషయంలో ఇలా స్పందించడం కూటమి ప్రభుత్వానికి మింగుడు పడడంలేదు.

వైసీపీ మాత్రం సుప్రీం వ్యాఖ్యలతో తాము నైతికంగా విజయం సాధించినట్లుగా భావించి సంబరాలు చేసుకున్నాయి. నెయ్యి వ్యవహారంలో కూటమినే దోషిగా నిలబెట్టి అటు వైసీపీ మీడియాలోనూ, సామాజిక మాధ్యమాలలోను కథనాలు ప్రచురించాయి.

టీటీడీ ఈఓ శ్యామలరావు వైఖరినే ఇప్పుడు ప్రధానంగా అందరూ ప్రశ్నిస్తున్నారు. ఆయన పొంతన లేని ప్రకటనలు ఇస్తున్నాడని ఆరోపిస్తున్నారు. అయితే, రేపు శుక్రవారం సుప్రీం కోర్టు తీసుకోబోయే నిర్ణయంపైనే చాలామంది ఆసక్తి కనపరుస్తున్నారు.

బాబుతో దోస్తీ చేస్తున్న బీజేపీ ఆయనకి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుని ప్రత్యేక బృందంతో దర్యాప్తుపై ఆదేశిస్తుందా? అన్నది ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్న అనుమానం.

నిజంగా బాబు ప్రభుత్వం దగ్గర ఖచ్చితమైన ఆధారాలు ఉంటే ఏ దర్యాప్తుకైనా కేంద్రం సైతం వెనకడుగు వేయబోదు. ప్రతిపక్ష పార్టీని ఇరకాటంలో పెట్టాలనే అత్యుత్సాహంతో బాబు తొందరపడ్డారన్న మాట ఓ వర్గం విశ్లేషకుల నుండి వినపడుతోంది. నలభై ఏళ్ళ అనుభవం ఉన్న వ్యక్తి అలా తొందరపడరని, నిజాలను నిగ్గుతేల్చి కల్తీ వీరులకు శిక్షపడేవరకు ఆయన వదిలిపెట్టరని మరో వర్గం విశ్లేషకులు భరోసా వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద 'నెయ్యి తీసిన గొయ్యి'లో 'లడ్డులా పడబోతున్నదెవరు' అన్న సందేహం మాత్రం అన్ని పార్టీల శ్రేణుల నుండి వినపడుతుండడం గమనార్హం. ఓం!.. నమో వేంకటేశాయ..!

# మీ సేవలు అమూల్యం.. అపారం!

## పారిశుద్ధ్య కార్మికులను నూతన వస్త్రాలతో సత్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2న కోవూరు మండలపరిధిలోని 150 మంది పారిశుధ్య కార్మికులకు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నూతన వస్త్రాలను బహుకరించి సన్మానం చేశారు. వేగూరు గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, సమాజానికి పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం.. అపారమని కొనియాడారు. వారి ప్రాణాలను పణంగా పెట్టి పరిశుభ్రతా కార్యక్రమాలు చేపడుతూ, మనందరి ఆరోగ్యాలను వారు కాపాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందని ఆమె చెప్పారు.



ఒక్క రూపాయి కూడా ఆశించకుండా దాతల సహాయంతో ఇక్కడ ఇన్ని కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని కొనియాడారు.

## 'కైలాసభూమి' తరహాలో శ్మశాన వాటికలు



కోవూరులోని 'కైలాసభూమి'ని ఆదర్శంగా తీసుకొని నియోజకవర్గంలో శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల కోవూరు కైలాసభూమి నిర్మాణకమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభలో వేమిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. బండి సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో...మృతదేహాలను ఉంచేందుకు నిర్మించిన భవనానికి, దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మృత్యుంజయ స్థూపానికి వారు ప్రారంభోత్సవాలు చేశారు. కోవూరులో 'కైలాసభూమి' పేరుతో స్మశాన వాటికను అభివృద్ధి చేసిన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వం నుంచి

## గాంధీజీ ఆశ్రమ అభివృద్ధికి కృషిచేస్తా:



ఇందుకూరుపేట మండలం వల్లిపాడులోని పినాకిని గాంధీజీ ఆశ్రమాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ ఇచ్చారు. అక్టోబరు 2న గాంధీజయంతి సందర్భంగా ఆమె పినాకిని సత్యాగ్రహ ఆశ్రమాన్ని సందర్శించారు. గాంధీజీ విగ్రహానికి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, పల్లిపాడు గాంధీ ఆశ్రమ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం తాను ప్రాతినిధ్యం వహించే కోవూరు నియోజకవర్గంలో ఉండడం తమ అదృష్టమని అన్నారు. ఆశ్రమం నిర్వాహకులు గణేశం కల్పన, రెడ్ క్రాస్ కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు 'బులియన్ మర్చంట్స్' సాయం

నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్, పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్ వారు తమ సామాజిక సేవలో భాగంగా ఈనెల 2న 70మంది వృద్ధులకు ఆర్థికసాయం అందజేశారు. రంగనాయకులపేటలోని అసోసియేషన్ సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని వృద్ధులకు సాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ళ శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడు తిరివీధి కిషోర్‌కుమార్, కార్యదర్శి ఫణీంద్రకుమార్, కోశాధికారి సుబ్రహ్మణ్యం, ఛైర్మెన్ ఐతా సుబ్బరాయుడు, సభ్యులు అమరా శివ, సతీష్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ ఎప్పుడో?..చెప్పాలి!

### డీసీసీ నేత చేవూరు



'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ' పేర్లతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం 100 రోజుల మంచి పాలన అని మురిసిపోవడం సిగ్గుచేటని, అసలు వారు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ఎప్పుడు ఆచరణకు వస్తాయో చెప్పాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ఇటీవల స్థానిక ఇందిరాభవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీడీపీ నేతలు గత వంద రోజుల పాలనలో కక్ష సాధింపు ధోరణులు తప్ప, ఇచ్చిన హామీలవైపు చూడలేదన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మూడు సిలిండర్ల ఉచితం, యువగళం, రైతులకు పెట్టుబడి సహాయం కింద 20,000 రూపాయలు వంటి హామీలిచ్చిన టీడీపీ నేతలు వాటిని ఇంకా అమలుచేయకుండా మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావుయాదవ్, నాయకులు షేక్ ఫయాజ్, ఏటూరి శ్రీనివాసులరెడ్డి, పీసీసీ సభ్యులు బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక సరఫరాకి పటిష్ట చర్యలు

జిల్లా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను సరఫరా చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. ఈ నెల 3వ తేదీ గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రజల అవసరాలకు సరిపడా ఇసుకను సిద్ధం చేస్తున్నామని, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతిఒక్కరికీ ఇసుకను సకాలంలో అందించేందుకు చర్యలు చేపట్టామని, త్వరలోనే ఓపెన్ రీచ్‌లు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు.



లాయర్
అక్టోబర్ 04, 2024

# 'మృగత్వం'గా మారుతున్న మానవత్వం!

తల్లిని పూజించి, మహిళలను గౌరవించే మహనీయ తత్వం, మానవత్వం పుష్కలంగా ఉన్న మన భారతావనిలో.. నానాటికీ అతివలపై జరుగుతున్న అఘాయిత్యాలు సభ్య సమాజాన్నే తలదించుకునేవిధంగా చేస్తున్నాయి. మంచి-మానవత్వం క్రమేణా పూర్తిగా నశించిపోతున్నాయి. మగాళ్ళు మృగాళ్ళుగా తయారవుతున్నారు. మానవత్వం మృగత్వంగా మారిపోతోంది. ఇతరుల పట్ల, తమ కుటుంబసభ్యులైన ఆడపిల్లల పట్ల, చిన్నారుల పట్ల కూడా మృగాళ్ళ ప్రవర్తన అత్యంత ఘోరంగా ఉంటోంది. బంధాలు, అనుబంధాలు, బంధుత్వాలు, ప్రేమలు, అనురాగాలు, ఆత్మీయతలు, చివరికి పేగుబంధాలు, రక్తసంబంధాలు అన్నీ నాశనమైపోతున్నాయి. వావి లేదు, వరుస లేదు. చిన్నా పెద్దా తేడా అంతకన్నా లేదు. అక్క లేదు.. చెల్లి లేదు.. ఆఖరికి కన్నకూతుర్లపై కూడా అకృత్యాలే. కనీస ఇంగితజ్ఞానం కూడా లేకుండా, పశువుల కంటే ఘోరంగా కన్నబిడ్డలపైనే అత్యాచారాలకు పాల్పడుతున్న కామాంధులు.. నరరూప రాక్షసులెందరో ఉంటున్నారు. కన్నతండ్రులే కాలనాగులైతే ఎవరికి చెప్పుకోవాలి?.. కట్టుకున్న వాడే కాలయముడై కత్తితో మెడ నరికితే ఏమనుకోవాలి?.. భర్తగా తాళికట్టినవాడే నిత్యం కాల్చుకుతింటుంటే, రక్షించాల్సిన వాడే ముక్కలు ముక్కలుగా కోసి భక్షిస్తుంటే.. ఇక ఈ సమాజం ఎటు పోతున్నట్లు?.. ఏమైపోతున్నట్లు?.. రానురాను సమాజంలో మహిళలకు రక్షణ ఉండడం లేదు. మహిళలు, ఆడబిడ్డలపైన జరుగుతున్న దౌర్జన్యాలు, హత్యలు, హత్యాచారాలకు అంతే లేదు. ఎన్ని కఠినచట్టాలు వస్తున్నా, ఎంతగా దండనలు ఉంటున్నా ఈ దారుణాలు నిత్యం ఏదో ఒకచోట జరిగిపోతూనే ఉన్నాయి. ఇంటా బయటా చిన్నారులకు కూడా భద్రత ఉండడం లేదు. బడికి పోవాలన్నా.. బయటకు పోవాలన్నా, చివరికి ఇంటికి పోవాలన్నా భయపడే పరిస్థితులు దాపురిస్తున్నాయి. అందులోనూ అంతర్జాలం (ఇంటర్నెట్) అందుబాటులోకి వచ్చి, స్మార్ట్ ఫోన్లు వచ్చాక అరచేతిలోకి ప్రపంచం వచ్చేసింది. దానివల్ల ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మంచి ప్రయోజనాలున్నాయి. లెక్కేలేనన్ని విజ్ఞాన విషయాలు కొల్లలుగా ఉంటాయి. కానీ, అది కూడా దుర్వినియోగం అయిపోతోంది. అశ్లీల దృశ్యాలతో అంతర్జాలం ఒక మాయా జాలంగా, ఒక పెద్ద బూతుబుంగగా తయారవుతోంది. దానికి తోడు కొన్ని సామాజిక మాధ్యమాలు, టీవీలు కూడా రకరకాల శృంగారపు పేర్లతో తమవంతు బూతును కుమ్మరిస్తూనే ఉన్నాయి. సమాజంలో విషాన్ని చిమ్ముతూనే ఉన్నాయి. వీటన్నిటివల్ల సమాజంలో అసభ్యపు ప్రవర్తనలు, లైంగిక దాడులు ఎక్కువవుతున్నాయంటూ మేధావులు ఆవేదన చెందుతున్నారు. అనైతిక ప్రవర్తనల వల్ల సమాజంలో నైతిక విలువలు, మానవత్వపు విలువలు.. అన్నీ మట్టికొట్టుకుపోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, సమాజం అశ్లీలపు ఊబిలో పడి కూరుకుపోతోంది. అశ్లీల సంస్కృతి చాపకింద నీరులా అంతటా పాకిపోతోంది. సిగ్గూ లజ్జా లేకుండా, చిన్నారులతో అశ్లీలదృశ్యాల చిత్రీకరణ చేస్తూ, 'చైల్డ్ పోర్న్' పేరుతో పైశాచికానందం పొందే దౌర్భాగ్య సంస్కృతి మానవీయతను మంటకలుపుతోంది. చిన్నపిల్లల అశ్లీల చిత్రాలను, దృశ్యాలను ఆన్‌లైన్‌లో పెడుతూ, ఇతరులకు షేర్ చేస్తున్న నీచులు ఎక్కువైపోతున్నారంటే కారణం అదే. వాటిని చూసి అకృత్యాలకు పాల్పడుతున్న సంఘటనలూ ఉన్నాయి. పసికందులపై, బడులకు వెళ్లే చిన్నారులపై కూడా దారుణమైన లైంగికదాడులు అధికమవుతున్న ఈ నేపథ్యంలో, సమాజాన్ని చెడగొడుతున్న 'చైల్డ్‌పోర్న్'పై కొరడా విదిలిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పునివ్వడం హర్షదాయకం. ఆ విషయంలో గతంలో మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పు సరికాదంటూ, దానిని సుప్రీం సరిదిద్దింది. బాలలతో చిత్రించిన అశ్లీల దృశ్యాలను (చైల్డ్ పోర్నోగ్రఫీ) చూడడం, వాటిని డౌన్‌లోడ్ చేయడమే కాదు, వాటిని కలిగివున్నా కూడా నేరమే నంటూ స్పష్టమైన తీర్పు చెప్పింది. అలాంటి అశ్లీలదృశ్యాలను మరొకరికి పంపించే, లేదా వ్యాప్తి చేసే ఉద్దేశం లేకున్నాసరే, వాటిని కలిగివుండడం శిక్షార్హమైన నేరంగా పరిగణించాలంటూ తీర్పు చెప్పడం చిన్నారులకు సుప్రీంకోర్టు ఇచ్చిన ఒక పెద్ద భద్రత.. ఒక పెద్ద రక్షణ కవచం అనే చెప్పవచ్చు. ఏదేమైనా ఇలాంటి విషసంస్కృతుల నుంచి సమాజం బయటపడాలి. అశ్లీలచిత్రాల వ్యాప్తిని నిరోధించేందుకు ప్రభుత్వాలు మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలి. వాటిని తయారుచేసేవారి భరతం పట్టాలి. అంతేకాదు, తల్లితండ్రులు, గురువులు చిన్నారులను కంటికి రెప్పల్లా కాపాడుకోవాలి. పతనమైపోతున్న మానవీయ విలువలను తిరిగి రాబట్టుకోవాలి. విద్యాలయాల్లో నైతికవిద్యకు పెద్దపీట వేయాలి. తద్వారా.. పిల్లలను జ్ఞానవంతులుగా, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి.

# నల్లపరెడ్డి శీనయ్య పేరు తొలగించడం సబబు కాదు!

జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన పాతతరం నాయకులలో కీర్తిశేషులు నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రముఖులు. నిస్వార్థ ప్రజాజీవితం గడిపిన మచ్చలేని నాయకుడాయన. ఒక్కరోజు కూడా శాసనసభా సమావేశాలకు గైర్హాజరు కాకుండా రికార్డు సృష్టించిన ఘనత శ్రీనివాసులరెడ్డి గారిది. ఆయన ఏ హోదాలో వున్నా నిరంతరం రైతు శ్రేయస్సుని గురించే తపనపడేవారు. సాధ్యమైనన్ని నీటి పారుదల ప్రాజెక్టులకి రూపకల్పన చేసి మంజూరు చేయించేవారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిగా, రైతుల కష్టనష్టాలు తెలిసిన రైతుగా ఆ రంగంపై ఎక్కువ దృష్టి పెట్టేవారు. అలాంటి శ్రీనివాసులరెడ్డి గారి పేరు నెల్లూరు బ్యారేజికి పెట్టడం ముదావహం. తన జీవితమంతా రైతు కోసం తపించిన శీనయ్యకి నిజమైన నివాళిగా, ఆయన సేవలకు గుర్తుగా దీనిని భావించవచ్చు. ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం ఆ పేరుని తొలగించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అలా చేయడం సముచితం కాదు. పార్టీలకి, రాజకీయాలకి అతీతంగా ఆలోచించి ఆ పేరుని కొనసాగించవలసిందిగా శ్రీనివాసులరెడ్డి అభిమానుల పక్షాన కోరుతున్నాను. నెల్లూరు నగరంలోని వేదాయపాలెంలో శ్రీనివాసులరెడ్డి విగ్రహాన్ని ఆర్భాటంగా ఆవిష్కరించారు. అయితే, ఆ విగ్రహం ఆలనా పాలనా చూసేవారే లేకుండా పోయారు. ఇటు శీనయ్య కుటుంబం అటు నగరపాలక సంస్థ ఎవరూ పట్టించుకోవడంలేదు. శ్రీనివాసులరెడ్డి గారి జయంతి, వర్ధంతులు కూడా జరపడంలేదు. కనీసం బ్యారేజీకైనా ఆయన పేరు ఉంటే భావి తరాలకి స్ఫూర్తిదాయకమవుతుంది.

వేరేవాటికి నయాతరం నాయకుల పేర్లు పెట్టారు. వాటి గురించి నేను ప్రస్తావించదలుచుకోలేదు. కనీసం శ్రీనివాసుల రెడ్డి లాంటి వారికి తగిన గౌరవం ఇవ్వవలసిందిగా కోరుతున్నాను. పెట్టిన పేరు తీసివేయడమంటే కేవలం శ్రీనివాసుల రెడ్డినే కాకుండా, అధికార పార్టీ నాయకులు తమని తామే అవమానించుకున్నట్లు అవుతుంది. పేరు మార్పు విషయంలో పునరాలోచించవలసిందిగా ప్రభుత్వ పెద్దలకి విజ్ఞప్తి చేస్తున్నాను!

**పెళ్లేటి గోపాలరెడ్డి,**
**సీనియర్ న్యాయవాది,**
**బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కోట.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# జాతర ఏర్పాట్లు బాగున్నాయి!

వెంకటగిరి శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లి జాతరలో ఈసారి దర్శనానికి ఏర్పాట్లు చాలా పకడ్బందీగా నిర్వహించారు. వీఐపీ పాసులు ఇవ్వకుండా 300, 100 దర్శనంతో పాటు, సాధారణ భక్తులకు కూడా దర్శనానికి అవకాశం కల్పించడం ఈ జాతర నిర్వహణలో ప్రత్యేకత. ఉచిత క్యూ లైన్‌లో దర్శనాన్ని పొందినవారు కూడా క్యూలైన్ల ఏర్పాట్లని గురించి అభినందించడం గొప్ప విశేషం. దళారుల బెడద లేకపోవడం, కేవలం రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ ముఖ్యులు మాత్రమే పరిమిత సంఖ్యలో వీఐపీ దర్శనాలను పొందడం, ఈ కార్యక్రమ నిర్వాహకుల పారదర్శకతకు అద్దం పట్టింది. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు వంటి అధికారుల సమర్థత, వారి సిబ్బంది సహకారం ఈ ఏర్పాట్లలో కీలకమైన పాత్ర పోషించింది.

**- పల్లేటి బాలాజీ, నెల్లూరు.**




# రైతన్నల గోడు.. వినేవాడే లేడు!

'రైతే దేశానికి వెన్నెముక' అంటారు.
అన్నదాతలు లేనిదే గిన్నెల్లోకి మెతుకులు, నోట్లోకి ముద్దా ఉండవంటారు.
రైతన్నలు బాగుంటేనే దేశం బాగుందంటారు.
అన్నీ బాగానే ఉన్నాయి.
వినడానికి ఇంపుగా కూడా ఉన్నాయి.
కానీ, మనదేశంలో రైతన్నల కష్టాలు మాత్రం నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. ఎంతోకాలంగా వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంటున్నాయి.
దేశంలో రైతుల బాధలు పట్టించుకునేవారు లేకపోవడంతో, అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకే అన్నం లేని దుస్థితి ఏర్పడుతోంది.
అందులోనూ ప్రకృతి విపత్తులతో రైతులు ఎన్నో ఏళ్లుగా నలిగిపోతున్నా, పాలకులు కానీ.. ప్రభుత్వాలు కానీ వారిని ఆదుకునేందుకు ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు.
దీంతో రైతులు అనాదిగా అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. ఎప్పుడు వానలొస్తాయో, ఎప్పుడు వరదలొచ్చి పంటలన్నీ మునిగిపోతాయో తెలియదు.
పంటలు పచ్చగా ఉన్నప్పుడు అకాలవర్షాలొచ్చి పొలాల్ని ముంచేస్తుంటాయి. నాట్లు వేసుకుంటున్న దశలోనే భారీ వానలొచ్చి పంటల్ని మింగేస్తుంటాయి. అదునులో అవసరమైనప్పుడు కురవాల్సిన వానలు, కురవకుండా తమాషా చూస్తుంటాయి. నీలిమేఘాలు ముఖం చాటేసి రైతుకు ఏడుపు మిగిలిస్తుంటాయి. వర్షాభావంతో, కరువుతో రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి.
ప్రభుత్వాలు నింపాదిగా వాటిని 'కరువు ప్రాంతాలు'గా ప్రకటించి చేతులు దులుపుకుంటాయి. కరువు బారిన పడిన రైతులను సకాలంలో ఆదుకోవడంలో మాత్రం విఫలమవుతుంటాయి.
అసలు కరువు పరిస్థితులు రాకుండా నీటివనరులను పటిష్టం చేయాలన్న ఆలోచనే ప్రభుత్వాలు చేయడంలేదు. రైతాంగంపట్ల, వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వాలకి వున్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం.

## బురద మిగిల్చిన బుడమేరు వరద :

మొన్నటికి మొన్న బుడమేరు బెజవాడను ముంచెత్తింది. ఊళ్లల్లో జనజీవనాన్ని ఛిన్నాభిన్నం చేసింది. పంటపొలాల్లో బురదను నింపింది. రైతులకు కన్నీరు మిగిల్చింది. రైతులంతా పంటల్ని కోల్పోయి, చేతిలో చిల్లిగవ్వ లేక విలవిలలాడుతున్నారు.
దాదాపు లక్షా 70వేల ఎకరాల్లో పంటలు, 18వేల ఎకరాల్లో పండ్లతోటలు పూర్తిగా నాశనమయ్యాయని, మొత్తంగా దాదాపు 2 లక్షలా 34వేల మంది రైతన్నలు నష్టాల్లో మునిగిపోయారని ప్రభుత్వ గణాంకాలే చెప్తున్నాయి.
పాడిపశువులెన్నో మృత్యువాత పడ్డాయి. బతికినవి గడ్డి లేక బిక్కచచ్చిపోతున్నాయి. రైతుల కష్టమంతా గంగలో కలిసిపోయింది. వారిని ప్రభుత్వాలు ఏమేరకు ఆదుకుంటాయో ఆ దేవుడికే తెలియాలి.
ఉత్తరాంధ్ర మొత్తం వరద భీభత్సాల్లో ఉంటే, రాయలసీమ ప్రాంతమంతా వానలు లేక కరువుతో అవస్థలు పడుతోంది. 'ఒక కంట కరువు..మరోకంట నీరు' అన్నట్లుగా ఉంది పరిస్థితి.
అయినా, ప్రభుత్వాల్లో చలనం ఉండడం లేదు.

## కష్టాలు కన్నీళ్ళతోనే..సేద్యం :

మనదేశంలో రైతులకు ఎప్పుడూ కష్టాలు.. కన్నీళ్లే. ప్రకృతి భీభత్సాలతో ఇప్పుడు సేద్యం ఒక జూదంగా మారిపోయింది.
పంట పండి చేతికందేదాకా నమ్మకం ఉండడం లేదు.
పండించిన పంటను భద్రపరచుకునేందుకు వసతులుండడం లేదు.
వాటిని అమ్ముకునేందుకు మార్కెట్లో గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ప్రతి దశలోనూ రైతులకు అవస్థలే.
కుటుంబాలను పోషించుకోలేక, చేసిన అప్పులు తీర్చుకోలేక రైతన్నలు పడుతున్న బాధలు వర్ణనాతీతం!.. ఈ కష్టాల సేద్యం ఇంకా ఎంతకాలం చేయాలోననే నిరాశా నిస్పృహలు వారిని ఆవరిస్తున్నాయి.
వానొస్తే, వరదొస్తే.. పంటలు మునగాల్సిందే తప్ప మరో ప్రత్యామ్నాయమే ఉండడం లేదు. వివేకం, విజ్ఞానం, శాస్త్రజ్ఞానం, అన్నీ మనకున్నా.. ఎండల్లో వానల్లో బురదలో దిగి కష్టించి మనకు తిండిగింజలు పండించే రైతు బాగుకోసం మాత్రం వాటిని ఉపయోగపెట్టుకోలేకపోవడం దారుణం?

## ముందుచూపు లేని ప్రభుత్వాలు :

వానలు రాకముందే, కాలువలు-చెరువులు దొరువులు, వాగులు వంకలు, నదులు జలాశయాలతో సహా సాగునీటి ప్రాజెక్టులను పటిష్టం చేసుకుంటే, వానలొచ్చినప్పుడు నీటిని పొదుపు చేసుకోవచ్చు.
దాహమైనప్పుడు బావి తవ్వుకునే చందంగా కాక, చెక్‌డ్యామ్‌లు, ఆనకట్టలు వంటివి ముందుగా కట్టుకుని వర్షాకాలపు నీటిని నిల్వ చేసుకుని, ఒక క్రమపద్ధతిలో పంటపొలాలకు అందించవచ్చు. ప్రతిఏటా వరదలొచ్చినప్పుడల్లా నష్టాల పాలవకుండా చూసుకోవచ్చు.
అయితే, ముందుచూపు లేని ప్రభుత్వాలు రైతుల అతీగతీ అసలు పట్టించుకోవడం లేదు. దీంతో, క్షేత్రస్థాయిలో రైతన్నలు ముఖ్యంగా.. బీదాబిక్కీ రైతులు ఏ చిన్న విపత్తు వచ్చినా అల్లాడిపోతూనే ఉన్నారు.
స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడిచిపోతున్నా రైతు దుస్థితిలో ఎలాంటి మార్పు రావడం లేదు. ఇకనైనా ఇలాంటి దీనస్థితి పోవాలి. వరదనీటిపారుదలకు వీలుగా.. అన్ని ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను, అడ్డంకులను యుద్ధప్రాతిపదికన తొలగించాలి.
కష్టాలకడగండ్లలో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపాలి. ముందుగా, పంటనష్టాలను అంచనా వేసి తగిన పరిహారాన్నిచ్చి చేయూతనివ్వాలి. ప్రథమ ప్రాధాన్యత కల్పించి నిధులు మంజూరుచేసి రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకోవాలి.
నష్టాలతో కుమిలిపోతున్న రైతులను మానవతా దృక్పథంతో ఓదార్చి, తిరిగి వారు పొలంబాట పట్టేందుకు భరోసా కల్పించాలి!

**- రాజశ్రీ**

## సింహపురి వైద్య సేవాసమితి ఆధ్వర్యంలో..

# ఆకట్టుకున్న గిరిజన 'బాలమేళా'

**నెల్లూరులోని సింహపురి వైద్య సేవాసమితి ట్రస్ట్, జయభారత్ హాస్పిటల్ సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన గిరిజన బాలల బాలమేళా కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. జిల్లాలోని గిరిజనుల కోసం వైద్య-విద్యా రంగాలలో ఈ ట్రస్ట్ ఎంతోకాలంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కోవూరు, ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, నెల్లూరు రూరల్, నెల్లూరు మండలాల్లోని 50 గిరిజన సంఘాల్లో బాల సంస్కార కేంద్రాలు, సాయంకాలం బడులు నిర్వహిస్తున్నారు. 2022 సంవత్సరంలో 10 కేంద్రాలతో ప్రారంభమై, ప్రస్తుతం 50 కేంద్రాలు నిర్వహిస్తున్నారంటే వీటికి ఎంత మంచి ఆదరణ ఉందో తెలుస్తుంది. ప్రతిరోజు 1200 మంది బాలలు బాల సంస్కార కేంద్రాల ద్వారా చదువుతోపాటు, సంస్కారవంతమైన అంశాలను నేర్చుతూ.. వారి కుటుంబాలలో మార్పులు తీసుకురావడం, తద్వారా పిల్లలను బడిబాట పట్టించి డ్రాప్ అవుట్స్ శాతాన్ని తగ్గించడం జరుగుతోంది.**




ఈ నేపథ్యంలో ఇటీవల నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో సుమారు వెయ్యి మంది బాల సంస్కార కేంద్రాల బాలలతో నిర్వహించిన బాలమేళా అందరినీ ఆకర్షించింది. బాలలతో పాటు, 450 మంది పిల్లల తల్లిదండ్రులు కూడా పాల్గొనడంతో, వారందరికీ నిర్వాహకులు అల్పాహారం పెట్టి చదువు ప్రాధాన్యతను తెలియజెప్పారు. విజ్ఞాన భారతి రాష్ట్ర కో-కన్వీనర్ పూడి వెంకటప్రసాద్ ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన విషయాలను సమీక్షించారు. పిల్లలందరూ కూడా బాల సంస్కార కేంద్రాల్లో ఉండే విధంగా చూడాలని, నెలకొకసారి తల్లిదండ్రులతో సమీక్షా సమావేశం నిర్వహించి వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు. గిరిజన నాయకుడు వై.సుధాకర్, బాల సంస్కార కేంద్రాల ప్రాజెక్టు ఇన్‌చార్జి సుబ్బారావు, గిరిజన నాయకుడు ఈగ రామయ్య, పోట్లూరు శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ నాయకులు యుగంధర్, ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు

### నిస్వార్థ సేవాసంస్థ - ఐటీడీఏ పరిమళ

ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ పరిమళ మాట్లాడుతూ, జిల్లాలో గిరిజనుల అభ్యున్నతి కోసం నిస్వార్థంగా వైద్యం-విద్య రంగాలలో సేవలు అందిస్తున్న సంస్థ సింహపురి వైద్య సేవాసమితి అని కొనియాడారు. ట్రస్టు కార్యక్రమాలకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు యుగంధర్ మాట్లాడుతూ, ప్రతివ్యక్తికి చదువు ఎంత అవసరమో.. సంస్కారం అంతకన్నా అవసరమన్నారు. నెల్లూరు ఇస్కాన్ మందిరం అధ్యక్షులు శ్రీ శుకదేవస్వామి, విశ్రాంత డీఐజీ చౌటూరు వెంకటేశ్వర్లు, జెపి జైన్, సాంబశివ, మోదెం మల్లికార్జున్, వి. సుధాకర్, సింహపురి వైద్య సేవాసమితి ఉపాధ్యక్షులు బాలు సుబ్బారావు, కోశాధికారి గుర్రం సుధాకర్, ఆర్ఎస్ఎస్ విభాగ్ నాయకులు రామదండు, డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, భయ్యా రవికుమార్, బీఎస్‌రెడ్డి, డాక్టర్ రఘు రామయ్య, కోడూరు సత్యం, ఊటుకూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




# ఉదయగిరి..దాహార్తి తీర్చండి



## అధికారులకు ఎమ్మెల్యే కాకర్ల దిశానిర్దేశం

ఉదయగిరి నియోజకవర్గంలోని అనేక పంచాయతీలు నీటి కటకటతో కొట్టుమిట్టాడుతున్నాయని, అధికారులు ఆయా ప్రాంతాలపై దృష్టి సారించి ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 143 పంచాయతీల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, వెంటనే చర్యలు చేపట్టి ప్రజల దాహార్తి తీర్చాలని సూచించారు. జలసిరి పథకం ద్వారా నియోజకవర్గంలో రైతులకు అత్యధిక బోర్లు వేసేలా ప్రణాళిక రూపొందించాలని, అదేవిధంగా ఎన్టీఆర్ సృజల స్రవంతి కార్యక్రమం ద్వారా పంచాయతీలలో మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని తెలిపారు. క్లోరిన్ రహిత నియోజకవర్గంగా ఉదయగిరిని రూపుదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఆయన కోరారు. మూగజీవాల కోసం అవసరమైనచోట్ల బోర్లు వేసి చేతి పంపులు అమర్చాలన్నారు.



# దేవీ నవరాత్రి ఉత్సవాలకు..రండి!

## ముఖ్యమంత్రి చంద్రబాబును, లోకేష్‌ను ఆహ్వానించిన మంత్రి రామనారాయణ

విజయవాడ కనకదుర్గమ్మ దేవాలయంలోనూ, శ్రీశైల భ్రమరాంబికాదేవి ఆలయంలోనూ జరుగనున్న దసరా నవరాత్రి మహోత్సవాలకు రావాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును, మంత్రి లోకేష్‌ను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గౌరవపూర్వకంగా ఆహ్వానించారు. ఇటీవల అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ శ్రీరామ్ సత్యనారాయణ, శ్రీశైలం-విజయవాడల్లోని అమ్మవార్ల దేవాలయాల ఇఓలు, వేదపండితులతో కలసి ఆయన ముఖ్యమంత్రిని, మంత్రి లోకేష్‌ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారికి శరన్నవరాత్రి వేడుకల ఆహ్వానపత్రికలను రామనారాయణ అందజేసి, శాలువలతో సన్మానించారు. వేదపండితులు వారికి కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీర్వాదాలనందజేశారు.

### ఇంద్రకీలాద్రిపై వేడుకలకు భారీ ఏర్పాట్లు :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు విజయవాడలో కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి రామనారాయణరెడ్డి చెప్పారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై అత్యంత వైభవంగా జరిగే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆయన మాట్లాడుతూ, అమ్మవారి దర్శనభాగ్యం కల్పించడంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈనెల 3వ తేదీ నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, కృష్ణానది ఘాట్‌లోని పవిత్ర సంగమం వద్ద నవరాత్రుల్లో హారతులు ఇచ్చే సంప్రదాయానికి మళ్లీ శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్లు, వాహనాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం కొండ కింద రెండు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటుచేశామని, అక్కడి నుంచి దేవస్థానం వారు ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాల్లో కొండపైకి భక్తులను తీసుకెళ్లి, తిరిగి పార్కింగ్ ప్రదేశాలకు తీసుకువచ్చేలా చేశామని తెలిపారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న ఘాట్‌రోడ్డు మరమ్మత్తు పనులు కూడా పూర్తయ్యాయని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ప్రశాంత వాతావరణంలో అమ్మవారి దర్శనం, అనుగ్రహం లభించేలా ఏర్పాట్లు చేశామని, అత్యంత శోభాయమానంగా ఉత్సవాలు నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు.



# నెల్లూరు కబుర్లు

### పరిసరాల పరిశుభ్రతతోనే..

## మహాత్మునికి అసలైన నివాళి

**జిల్లా కలెక్టర్ ఆనంద్**



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే జాతిపిత మహాత్మాగాంధీజీకి అసలైన నివాళి అవుతుందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. మహాత్మా గాంధీ జయంతి, స్వచ్ఛభారత్ దివస్ సందర్భంగా 'స్వచ్ఛతా హి సేవ' ముగింపు కార్యక్రమాన్ని స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జాయింట్ కలెక్టర్ కార్తీక్, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ తదితరులతో కలసి, కలెక్టర్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి, బాపూజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం, 'స్వచ్ఛత హి సేవ' ప్రతిజ్ఞను జిల్లా కలెక్టర్ చేయించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో విశేష సేవలందించిన ఎంపీడీవోలు శ్రీధర్, నగేష్ కుమారి, విజయ, ఈవోపీఆర్డీలు వీరేంద్ర, మహేశ్వరి, గోపి శ్రీనివాస్‌లను జ్ఞాపికలతో జిల్లా కలెక్టర్ సత్కరించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, ఆరోగ్య విభాగం అధికారులను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

## హాస్యం మానవ జీవితానికి టానిక్



హాస్యం మానవ జీవితానికి ఒక టానిక్‌లా పనిచేస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. స్థానిక చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక సేవాసమితి ఆధ్వర్యంలో టౌన్‌హాల్లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో 'తెలుగు సాహిత్యంలో హాస్యం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియలలో ఉన్న హాస్య, వ్యంగ్య కవితలు, పద్యాలను ఆయన వినిపించారు. ఏపీ జెన్కో డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు సభకు అధ్యక్షత వహించగా, పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి, వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం వక్తను ఘనంగా సన్మానించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ఎ. జయప్రకాష్, జి.సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.



## ఖైదీల సంక్షేమానికి సహకారం అందిస్తా

**ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

వృత్తి ఖైదీలందరూ జైలులో సమయాన్ని వృధా చేసుకోకుండా, వృత్తి నైపుణ్యాల్లో ప్రావీణ్యం పొందేందుకు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. అక్టోబరు 2న గాంధీజీ జయంతిని పురస్కరించుకుని బుజబుజ నెల్లూరు సమీపంలోని కేంద్రకారాగారంలో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలిసో తెలియక తప్పు చేసిన ఖైదీలందరూ వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే, శిక్షాకాలం పూర్తయిన తర్వాత సమాజంలో స్వయంగా ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. జైల్లో ఖైదీల వినోదానికి తాను రూ.5 లక్షలతో కలర్ టీవీలను అందించినట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. పాతికేళ్లుగా జైలులో ఖైదీల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. భోజనశాలలో మిక్సీలు, వంట పాత్రలు, ఒక వాహనం, అంబులెన్స్‌ను గతంలో తాము సమకూర్చామని తెలిపారు. ఖైదీల సంక్షేమానికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. తొలుత జైలు ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, సూపరింటెండెంట్ రాజారావు, ఏఎస్పీ మహేష్‌బాబు, డీఎస్పీ సాయి ప్రవీణ్, పలువురు జైలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 'విశ్వసాయి'లో.. గాంధీజయంతి



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాలలో అక్టోబరు 2 గాంధీజయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు జరిగాయి. కళాశాల ఛైర్మెన్ డా. ఎన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ జి.కృష్ణమోహన్‌లు పాల్గొని జాతిపిత బాపూజీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన నాయకుల్లో గాంధీజీ అగ్రగణ్యులని, ఆ మహాత్ముని ఆశయాల బాటలో అందరూ నడవాలని విద్యార్థులకు వివరించారు. కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, డీజీఎంలతో పాటు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## గాంధీజీకి డీసీసీ నాయకుల నివాళి

అక్టోబరు 2 గాంధీజయంతి సందర్భంగా నెల్లూరుజిల్లా కాంగ్రెస్ పార్టీ(డీసీసీ) అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర పీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఉడుతా వెంకట్రావుయాదవ్ సారధ్యంలో స్థానిక డైకస్‌రోడ్డు వద్దనున్న గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి డీసీసీ నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర పీసీసీ సభ్యులు బాలసుధాకర్, ఎం. సురేష్ బాబు, షేక్ అల్లావుద్దీన్, షేక్ హుస్సేన్ బాషా పాల్గొన్నారు.






## దసరాకి.. ప్రత్యేకబస్సులు

దసరా పండుగ, సెలవుల నేపథ్యంలో ఇతర రాష్ట్రాల నుంచి, దూరప్రాంతాల నుంచి నెల్లూరుకు వచ్చే ప్రయాణీకుల కోసం ఏపీఎస్ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు 82 ప్రత్యేక బస్సులను నడుపుతామని, 8న హైదరాబాద్ నుంచి నెల్లూరుకు 6 బస్సులు, 9న 11 బస్సులు, 10న 22 బస్సులు, 11న 26 బస్సుల వంతున ఏర్పాటుచేస్తున్నామని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. ప్రత్యేకించి బెంగుళూరు నుంచి నెల్లూరుకు ఈ దసరా పండుగ రోజుల్లో ప్రతి రోజూ 2 బస్సులను అదనంగా నడుపుతారు. అదేవిధంగా, విజయవాడ నుంచి నెల్లూరుకు 5 బస్సులు, చెన్నై నుంచి నెల్లూరుకు 5 బస్సులు, కడప నుంచి నెల్లూరుకు 5 బస్సులు ప్రత్యేకంగా నడపనున్నట్లు వారు పేర్కొంటున్నారు.

## స్టేట్‌బ్యాంక్.. 'స్వచ్ఛత హి సేవ'



అక్టోబరు 2న నెల్లూరులోని భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం వారు 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమం చేపట్టి స్థానిక చిల్డ్రన్స్ పార్కుల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్లు బి.శాంతి రాజు, సీహెచ్ లోకనాథం, సురేష్‌మోహ్రమ్, ఆర్.శేషగిరి, హెచ్ఆర్ మేనేజర్ పి.లక్ష్మీప్రసన్న, ఎస్‌బీఐ శాఖల సిబ్బంది, వినియోగదారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో..

## నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, ఈనెల 3 నుంచి ఉత్సవాలను అంగరంగ వైభవంగా ప్రారంభించారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సారధ్యంలో ఈనెల 12 వరకు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు కూడా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నెల్లూరు ఆర్డీఓ మలోల ఆధ్వర్యంలో దేవాలయ ప్రాంగణంలో ఇటీవల సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించి, భక్తుల ఆధ్యాత్మిక భావన దెబ్బతినకుండా, అమ్మవారి దర్శనం సంపూర్ణంగా జరిగిందని భక్తులు సంతృప్తిని వ్యక్తం చేసేవిధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు..

## డా.కిషోర్స్ రత్నం ఒలంపియాడ్ విద్యార్థులు



నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం ఒలంపియాడ్ విద్యార్థులు ఇటీవల ఆర్చరీలో తమ సత్తా చాటుకున్నారు. కోచ్ భరధ్వాజ ఆధ్వర్యంలో శిక్షణ పొంది రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల కాంపౌండ్ విభాగంలో కె. జనని, రికర్వ్ విభాగంలో పి.భావజ్ఞ హంసిని, అండర్-17 బాలికల విభాగంలో పి.కృతిక కిరణ్, ఏ.జాన్వీ ఆరాధ్య, అండర్-18 విభాగంలో కె.మోక్ష, అండర్-17 బాలుర విభాగంలో ఏ.వరుణ్‌రెడ్డి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఆ విద్యార్థులను ఇటీవల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కె.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. విద్యాసంస్థల మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

### టేబుల్ టెన్నిస్‌లో :



నెల్లూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వారు ఇటీవల స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ అండర్-14 విభాగంలో జరిగిన పోటీల్లో డా.కిషోర్స్ రోషిణి రత్నం జేఇఇ, కె25 మెడికల్ ఒలంపియాడ్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు ప్రతిభతో రాణించారు. బి.సూర్యజశ్వంత్, పి.వాసవ్య, టి.చిరుహాస్, కె.వైశాంత్, టి.నవీన్ కార్తీక్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా స్థానిక సరస్వతినగర్‌లోని డా.కిషోర్స్ రత్నం స్కూల్స్‌లో యాక్టివిటీ టైమ్‌జోన్‌లో టేబుల్ టెన్నిస్‌లో శిక్షణ పొందుతున్నారు. వారందరినీ ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.



## పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్‌గా.. మాగుంట శీనయ్య

ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మన నెల్లూరీయులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇటీవల గృహ–పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్‌గా నియమితులయ్యారు. ఆమేరకు లోక్‌సభ స్పీకర్ ఆయన్ను నియమించారు. అందుకు సహకరించిన ముఖ్యమంత్రికి చంద్రబాబునాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు శీనయ్య ఇటీవల తన కృతజ్ఞతలు తెలిపారు.

# విపిఆర్‌కి అరుదైన గౌరవం

- పార్లమెంట్ కమిటీ ఆన్ ఫైనాన్స్ సభ్యునిగా ఎంపిక



నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) పార్లమెంట్‌లో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మకమైన 'పార్లమెంట్ కమిటీ ఆన్ ఫైనాన్స్' సభ్యుడిగా ఆయన నియమితులయ్యారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలకు ఛైర్మెన్లు, సభ్యులను నియమిస్తూ ఇటీవల కేంద్రప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. పార్లమెంట్‌లోని లోక్‌సభ, రాజ్యసభ నుంచి సభ్యులను ఇందుకు ఎంపిక చేశారు. అందులో భాగంగా తెలుగుదేశం పార్టీ తరఫున పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీగా ఘన విజయం సాధించి, నెల్లూరు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కమిటీ ఆన్ ఫైనాన్స్ సభ్యుడిగా ఎంపిక చేయడం విశేషం. ఈ కమిటీలో రాజ్యసభ నుంచి 10 మంది, లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీకి ఛైర్మెన్‌గా ఎంపీ భర్తృహరి మహతబ్ వ్యవహరించనున్నారు. ఈ కమిటీలో నెల్లూరు ఎంపీ సభ్యునిగా ఎంపికవడంతో నెల్లూరీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# కోవూరును పర్యాటకంగా అభివృద్ధి చేయండి

- మంత్రి కందులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వినతి

కోవూరు నియోజకవర్గంలో ఉన్న వివిధ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. ఇటీవల వెంకటగిరి పోలేరమ్మ జాతరకు వచ్చిన మంత్రిని ఆమె ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి వివిధ అంశాలపై ఆయనకు వినతిపత్రం అందించారు. కనిగిరి రిజర్వాయర్ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని పర్యాటక కేంద్రంగా రూపుదిద్దాలని, ఇందుకూరుపేటలో ఉన్న మైపాడు బీచ్ నుంచి కొత్తకోడూరు వరకు రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే దక్షిణ భారత సబర్మతిగా పేరుగాంచిన పల్లిపాడులోని పినాకినీ గాంధీజీ ఆశ్రమాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించి, ఆశ్రమ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. చరిత్రాత్మకమైన పల్లిపాడు గ్రామాన్ని ఇప్పటికే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేశారని తెలిపారు. ఎమ్మెల్యే వినతులపై సానుకూలంగా స్పందిం



చిన మంత్రి, ఆ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మన పల్లెటూళ్ళు.. జానపదాలకి పుట్టిళ్ళు

## శ్రీసిటీలో ఆకట్టుకున్న చిగిచెర్ల కృష్ణారెడ్డి సారస్వతోపన్యాసం



శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఇటీవల జానపద సంస్కృతి, కళలపై ప్రసంగ కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత అధ్యాపకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, 'జానపదం అంటే జనపదం' అని, జన పదానికి పుట్టినిళ్ళు పల్లెటూళ్ళని, ఆ పల్లెల్లోని జనం నోట తరతరాలుగా అలవోకగా వస్తున్న పదాలు, పాటలే జానపద గేయాలన్నారు. సామెతలు, పొడుపుకథలు,వాద్యాలు, తిట్లు..వగైరాలన్నీ జానపద సాహిత్యంలో భాగమని చెప్పారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, అంతరించిపోతున్న జానపద సంపదను పరిరక్షించేందుకు తమ వంతు చేయూతనందిస్తామన్నారు. అనంతరం, పెరటాశి నెల రెండవ శనివారం ప్రాశస్త్యం దృష్ట్యా శ్రీసిటీలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోపూజ మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.











# డిఎస్ఆర్ ట్రస్ట్‌లో.. ఉచిత వైద్యసేవలు

అల్లూరు మండలం నార్త్ మోపూరు గ్రామంలోని దేవిరెడ్డి శారదా చారిటబుల్ ట్రస్ట్ (డిఎస్ఆర్ ట్రస్ట్)లో సెప్టెంబరు 29న మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వై.రవి కిరణం(కిమ్స్ ఆసుపత్రి-జనరల్ ఫిజీషియన్), డాక్టర్ కె.బాలకొండయ్య(ఎముకలు, కీళ్లవ్యాధుల నిపుణులు), డాక్టర్ అభినయరెడ్డి(న్యూరాలజిస్ట్), డాక్టర్ టీజీ లక్ష్మీదుర్గ(గైనకాలజిస్ట్), డాక్టర్ మంజీర బండి(చర్మవ్యాధుల నిపుణురాలు)తో పాటు, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, స్వర్ణభారతి ట్రస్టు (వెంకటాచలం) వారి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఉచిత వైద్య కంటిపరీక్షలు కూడా చేశారు. మొత్తంగా 442 మందికి వైద్యసేవలందించి మందులు ఉచితంగా అందజేశారు. హోమియో డాక్టర్ మహేంద్రనాథ్ పాల్గొని ఉచితంగా హోమియో మందులను అందించారు. స్థానిక తెలుగుదేశం నాయకులు బీద గిరిధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. డిఎస్ఆర్ ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరధరామిరెడి, ట్రస్ట్ మేనేజర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జెట్టి రమేష్, దేవిరెడ్డి శారద హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలతాచౌదరి, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి రామచంద్రారావు, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి నారాయణతో.. అజయ్ భేటీ



జనసేన రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర టిడ్కో ఛైర్మన్‌గా నియమితులైన వేములపాటి అజయ్‌కుమార్ ఇటీవల విజయవాడలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడ్కో ద్వారా చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణాలు, మౌళిక వసతుల కల్పనపై ఇరువురు చర్చించుకున్నారు.

# వైభవోపేతంగా గంధోత్సవాలు

## కసుమూరు - ఏఎస్‌పేట దర్గాలకు పోటెత్తిన భక్తులు





జిల్లాలోని ప్రసిద్ధమైన కసుమూరు దర్గా, ఏఎస్‌పేట దర్గాల్లో ఇటీవల అత్యంత వైభవంగా జరిగిన గంధోత్సవాలకు భక్తజనం వెల్లువలా తరలివచ్చారు. వెంకటాచలం మండలంలోని కసుమూరు మస్తానయ్య దర్గా అంటే రాష్ట్రంలోనే కాదు దేశవ్యాప్తంగా మంచి పేరుప్రఖ్యాతులున్న దర్గా. అదేవిధంగా అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట) దర్గాకూడా రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. కసుమూరులో మూడురోజులపాటు జరిగిన మస్తాన్‌వలి 247వ గంధమహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చందన్‌మహల్ వద్ద నుంచి గంధాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి, కడప పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేని నేతృత్వంలో దర్గాలోని మస్తాన్‌వలి సమాధికి లేపనం చేసి, ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. దర్గా ముజావర్లు పవిత్రమైన ఆ గంధాన్ని భక్తులకు పంపిణీ చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ ఖుదావన్, దర్గా వక్ఫ్‌బోర్డు అధికారి పఠాన్ అస్లాంఖాన్ తదితరుల పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ పి.సుబ్బారావు, ఎస్ఐ ఆంజనేయులు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

**ఏఎస్‌పేటలో :**

అనుమసముద్రంపేటలోని సయ్యద్ ఖాజారహమతుల్లా నాయబ్‌రసూల్ దర్గా 251వ గంధమహోత్సవం భక్తజనుల కోలాహలంతో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేకప్రార్థనలు చేశారు. మంగళవారం తహలీల్ ఫతేహాతో గంధమహోత్సవం పూర్తయింది. దర్గా అధికారి మహమ్మద్ హుస్సేన్, మాజీ ముతవల్లి హాఫీజ్‌పాషా ఆధ్వర్యంలో దర్గాలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు జరిగాయి.

# ఎన్‌బికెఆర్‌లో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 1న జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. ఐఇఇ విభాగం ఆధ్వర్యంలో 'కోడ్-మానియా' ఈవెంట్‌లో డీ బగ్గింగ్, కోడెథాన్ తదితర పోటీల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం, ఇన్నొవేషన్ మ్యాగజైన్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో సిఎస్‌ఇ విభాగాధిపతి రాజశేఖర్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి హరినాథ్‌రెడ్డి, ఇఇఇ విభాగాధిపతి సురేష్‌రెడ్డి, ఏఐ డిపార్ట్‌మెంట్ అధిపతి ఏ.నారాయణరావు, ఐఇఇ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం బెల్టుదుకాణాలపై..పోలీసుల దాడులు



జిల్లాలోని పలుప్రాంతాల్లో ఉన్న మద్యం బెల్టు దుకాణాలపై ఈనెల 1న పోలీసులు దాడులు చేశారు. మనుబోలు మండలం మడమనూరులో బెల్టుదుకాణాలు పెట్టి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో అర్ధరాత్రి సమయంలో పోలీసులు దాడులు చేసి 151 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిర్వాహకులను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాకేష్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు చేసి, బెల్టుదుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అదేవిధంగా, జలదంకిలో కూడా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, ఆ వ్యక్తివద్ద నుంచి 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# పారిశుద్ధ్య కార్మికులకు అండగా ఉంటా

### గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



గూడూరు మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు ఏ సమస్య వచ్చినా వారి కుటుంబ సభ్యుడిలాగా ఆ సమస్యను పరిష్కరించేందుకు పాటుపడతానని గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం ముగింపు సభ గూడూరు పట్టణంలోని మున్సిపల్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు పట్టణాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచే మున్సిపల్ కార్మికులను తాను కుటుంబసభ్యులుగా భావిస్తానని, ఎల్లవేళలా వాళ్లకి అండగా నిలుస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల వరదలు సంభవించిన విజయవాడ నగరంలో ఉత్తమ సేవలు అందించిన గూడూరు మున్సిపాలిటీకి చెందిన 11మంది కార్మికులకు ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పురస్కారాలు అందజేస్తూ అభినందనలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, టీడీపీ నాయకులు, మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



# ఘనంగా జెండా ఉత్సవం

గూడూరులో ఆంజనేయస్వామి జెండా మహోత్సవం ఈనెల 2వ తేదీ ఘనంగా జరిగింది. పట్టణంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా వివిధ రకాల దేవతామూర్తుల ఆకృతులు, ఆర్చీల ద్వారా పలు సెట్టింగులతో కళకళలాడాయి. తూర్పువీధిలో శ్రీ ఆంజనేయస్వామి వారి జెండా ఊరేగింపు సిరామిక్ కళాశాల దగ్గర ముస్తాబైంది.

కాగా, శ్రీ విజయదుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 2న గూడూరు గ్రామ దేవత శ్రీ తాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించి కలశాలతో అమ్మవారి క్షేత్రం నుండి ఊరేగింపుగా సత్యంగ నిలయం చేరుకోవడం జరిగిందని కోట సునీల్‌కుమార్ తెలిపారు.



# మండల స్థాయి చెకుముకి పరీక్షలు

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్కూల్ స్థాయిలో ప్రథమంగా వచ్చిన విద్యార్థినీవిద్యార్థులకు ఇటీవల మండల స్థాయిలో చెకుముకి సైన్స్ పరీక్షలను జడ్పీ బాలుర హైస్కూల్‌లో నిర్వహించడం జరిగింది. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని భారతి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే సైన్స్ పట్ల అవగాహన కలిగితే.. మూఢ నమ్మకాలకు దూరంగా ఉంటారని తెలిపారు. 32 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా చేస్తున్నందుకు జేవీవీ సభ్యులందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, సుమన్‌రెడ్డి, వివిధ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువమోర్చా ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్



భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో గూడూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఈనెల2న గాంధీ జయంతి నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కోర్ కమిటీ మెంబర్ విజయభాస్కర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ గాలి ప్రకాష్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిలాష్‌రెడ్డి, శివశంకర్, కిరణ్, నవీన్, ప్రదీప్, మహేష్ పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికల నిర్వహణలో చిక్కుముడులెన్నో!..

***దే**శంలో మరో పెద్ద సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పార్లమెంట్ నుంచి పంచాయతీల వరకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి కావాల్సిన సంసిద్ధతపై పూర్వ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన నివేదికను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించింది. ఆ నివేదికను అనుసరించి ఏకకాల ఎన్నికలు నిర్వహిస్తే ప్రపంచంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్న నాలుగో దేశంగా భారత్ అవతరిస్తుంది. ఇప్పటికే బెల్జియం, స్వీడన్, దక్షిణాఫ్రికా దేశాలు జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నాయి. వాస్తవానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి నాలుగు సాధారణ ఎన్నికలు-1952,1957,1962,1967లో లోకసభకు, రాష్ట్రాలకు ఏకకాలంలోనే ఎన్నికలు జరిగాయి. అయితే ఈ జమిలి ఎన్నికల నిర్వహణలో ప్రయోజనాలతో పాటు చిక్కుముడులూ ఎన్నో ఉన్నాయి.***

లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల నిర్వహణఖర్చు చాలావరకు ఆదా అవుతుందని కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ఇది చాలావరకు వాస్తవం. మొన్నటి వేసవిలో జరిగిన సాధారణ ఎన్నికల ఖర్చు లక్షల కోట్లు దాటిపోయిన నేపథ్యంలో, రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు ఎప్పటికప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఆ అదనపు ఖర్చు ఆదా అవుతుందనడంలో సందేహం లేదు. ఆ ఖర్చుకు తోడు, దేశంలో ఎప్పుడు చూసినా ఏదో ఒక మూల ఎన్నికలు నిర్వహిస్తూనే ఉండడం వల్ల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుంది. నియమావళి అమల్లో ఉన్నన్ని రోజులు ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కేంద్రం కొత్తగా పథకాలు ప్రకటించడానికి, సత్వరం అమలు చేయడానికి వీలుండదు. ఇది కూడా ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి అవరోధంగా ఉంటోంది. జమిలి ఎన్నికలతో ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు.

## చిక్కుముడులూ ఉన్నాయి :

జమిలి ఎన్నికల నిర్వహణలో సమస్యలెన్నో ఉన్నాయి. పెద్ద అవరోధం ఏమిటంటే, రాజ్యాంగపరమైన నిబంధనలు. ఈ సమస్యకు సాంకేతికంగా రామ్‌నాథ్ కోవింద్ కమిటీ పరిష్కారం చూపించింది. రాజ్యాంగ సవరణలను సూచించింది. అయితే వాటికి పార్లమెంట్, రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి. దేశంలో వివిధ ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు, మార్గదర్శకాలకు ఉద్దేశించిన 1951 ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు ఆరు కీలక రాజ్యాంగ సవరణలకు పార్లమెంటు ఆమోదం అవసరం. ఈ రాజ్యాంగ సవరణలను పార్లమెంటు మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించాలి. లోక్‌సభలో ప్రస్తుతం ఎన్డీఏకి 293 మంది ఎంపీల బలం ఉంది. జమిలి ఆమోదానికి 362 మంది ఎంపీల మద్దతు అవసరం ఉంటుంది. రాజ్యసభలో ఎన్డీఏకు బలం 121 కాగా, జమిలి ఆమోదానికి 164 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంది. ఇక్కడే ఒక చిక్కు కూడా ఉంది. కాంగ్రెస్ సహా 15 విపక్ష పార్టీలు జమిలి ఎన్నికలకు ససేమిరా అంటున్నాయి. ఏకకాల ఎన్నికలకు పార్లమెంటుతో పాటు దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీల అంగీకారమూ అవసరమే. అంటే 14 రాష్ట్రాలకుపైగా జమిలికి అంగీకారం తెలపాలి. ప్రస్తుతం ఎన్డీఏ 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. అందులో భాజపానే సొంతంగా 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. కాబట్టి రాష్ట్రాల అంగీకారం సమస్య ఉండకపోవచ్చు కానీ, పార్లమెంట్ ఆమోదముద్రే సమస్య అవుతుందేమో మరి!.. ఏకకాల ఎన్నికల బిల్లును వచ్చే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, కాంగ్రెస్‌ను ఒప్పిస్తే దాదాపుగా సమస్య పరిష్కారమయినట్లే.

## విపక్ష పార్టీల అభ్యంతరాలు :

రాజ్యాంగా స్ఫూర్తికి, సమాఖ్య స్ఫూర్తికి ఏకకాల ఎన్నికలు విరుద్ధమని విపక్షాలు వాదిస్తున్నాయి. కోవింద్ కమిటీ సూచనల ప్రకారం తొలిసారి జమిలి ఎన్నికలు జరిగిన తర్వాత లోక్‌సభ తొలిసారి కొలువైనరోజును అపాయింటెడ్ డేగా ప్రకటిస్తారు. ఆ తర్వాత రాష్ట్రాల శాసనసభలు ఎప్పుడు ఏర్పడినా లోక్ సభ గడువుతో పాటే ఆ సభల గడువూ ముగిసిపోతుంది. ఆ తర్వాత నుంచి సాధారణ ఎన్నికలతో పాటే అసెంబ్లీల ఎన్నికలూ జరుగుతాయి కాబట్టి అవి పూర్తికాలం కొనసాగే అవకాశముంటుందని కోవింద్ కమిటీ పేర్కొంది. ఒక వేళ అప్పుడు కూడా అసెంబ్లీలు రద్దయ్యే పరిస్థితి వస్తే, మళ్లీ ఎన్నికలు నిర్వహించి మిగిలిన కాలానికే ఆ సభ కొనసాగాలని సూచించింది. ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రాంతీయ పార్టీలు, విపక్షాల వాదన. ఈ వాదనలో కాస్తంత హేతుబద్ధత ఉంది కానీ, పెద్ద ప్రయోజనం ముందు చిన్న నష్టంగానే భావించాలి. లేదంటే తరచూ ఎన్నికల వల్ల పాలన వ్యవస్థ మొత్తం ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై కాకుండా ఎన్నికలపైనే ఎక్కువగా దృష్టి పెట్టాల్సి వస్తుంది. లోక్ సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల జాతీయ, అంతర్జాతీయ అంశాల మాటున స్థానిక అంశాలు మరుగున పడిపోతాయని, దానివల్ల జాతీయ పార్టీలకే ప్రయోజనమనే ప్రాంతీయ పార్టీల వాదనలో పస ఉన్నట్లు అనిపించదు. అంశం తీవ్రతను బట్టి ప్రభావం ఉంటుంది కానీ స్థానికమా, జాతీయమా, అంతర్జాతీయమా అని ప్రజలు చూడరు. జాతీయ అంశాలే ప్రాధాన్యం అవుతాయనుకుంటే లోక్ సభకు ఎన్నికలు జరిగిన ప్రతిసారీ బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాత్రమే పోటీ ఉండాలి. ఆ రెండు పార్టీలే సీట్లు పంచుకోవాలి. కానీ ప్రాంతీయ పార్టీలూ ఎక్కువ స్థానాలే గెలుస్తున్నాయి.

కోవింద్ కమిటీ చేసిన సూచనల్లో ఆచరణలో ఎదురయ్యే ఒక సమస్య ఉంది. లోక్‌సభకు, శాసనసభలకు ఎన్నికలు జరిగిన తర్వాత 100 రోజుల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి అని కమిటీ సూచించింది. ఉపాధి కోసం వలసలు ఎక్కువగా వెళ్లే పల్లెవాసులు రెండు సార్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంత ప్రాంతానికి రావడం కష్టమైన పని. దీనివల్ల అటు స్థానిక సంస్థ ఎన్నికల్లో కానీ, లోక్ సభ-శాసనసభ ఎన్నికల్లో కానీ పోలింగ్ శాతం తగ్గే అవకాశం ఉంటుంది. ఇది మన ప్రజాస్వామ్యానికి మంచిదికాదు.

## ఈవీఎంలు, భద్రతా బలగాల సన్నద్ధత పెద్ద సమస్యే :

ఈ ఏకకాల ఎన్నికలకు ఈవీఎంలను సమకూర్చుకోవడం ఒక ప్రధాన సమస్య. 26.5 లక్షల బ్యాలెట్ యూనిట్లు, 17.8 లక్షల కంట్రోల్ యూనిట్లు, 17.8లక్షల వీవీప్యాట్లు అదనంగా అవసరమని ఎన్నికల కమిషన్ పేర్కొంది. వీటిని సరఫరాచేసేది ప్రభుత్వ రంగ సంస్థలైన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఈసీఐఎల్ మాత్రమే. వీటిని సమకూర్చుకోవడానికి దాదాపు ఏడాదిన్నర సమయం అవసరం. ఏకకాల ఎన్నికలకు అన్ని పార్టీలను ఒప్పించిన తర్వాత కానీ ఈ యూనిట్లకు ఆర్డర్ ఇవ్వలేరు. పైగా ఈవీఎంల జీవిత కాలం 15ఏళ్లు మాత్రమే. మరోవైపు కొత్త సాంకేతిక పరిజ్ఞానం వస్తున్న ప్రతిసారీ వాటిని మార్చుకోవాల్సి ఉంటుంది. ఈ అంశాలను ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఎప్పటికప్పుడు తగిన సంసిద్ధతతో ఉండాల్సి ఉంటుంది. మరో ముఖ్యమైన అంశం భద్రతా బలగాలు. దేశంలో పలు సమస్యాత్మక ప్రాంతాలున్నాయి. ప్రస్తుతం ఏకకాలంలో ఎన్నికలు జరగడం లేదు కాబట్టి ఒక చోట నుంచి మరోచోటకు భద్రతా బలగాలను తరలిస్తున్నారు. ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే మొత్తం భద్రతా బలగాలన్నీ ఎన్నికల విధుల్లో ఉండాల్సి ఉంటుంది. ఇతరత్రా శాంతిభద్రతల పర్యవేక్షణలో ఇది సమస్య కావచ్చు. దీనిపై సమగ్ర ప్రణాళిక అవసరం. ప్రధానంగా రాజకీయ పార్టీల్లో ఏకాభిప్రాయ సాధనే అసలు సమస్య. ఈ సమస్యలన్నిటినీ అధిగమించడానికి కేంద్రం ఎలాంటి కసరత్తు చేస్తుందో వేచి చూడాలి.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**

---



## జానకిరామ.. రామాయణం (33)

- ఊటుకూరు జానకి రామారావు

**ద**శరథుడు కౌసల్య గృహం చేరి పరిపరివిధాలుగా ఆలోచిస్తూ, కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉన్నాడు.

శోకంతో కృశించిపోయిన భర్తను చూస్తూ కౌసల్య కూడా దుఃఖం ఆపుకోలేక బిగ్గరగా ఏడ్వసాగింది.అడవిలో వారి అవస్థలు తలుచుకుంటున్నప్పుడల్లా వారి గుండె కరిగి కన్నీరై కాల్వలై ప్రవహించసాగింది.

అంతులేని వేదన, అలుపులేని రోదన.

అలుపుసొలుపూలేకుండా ఒకటే దుఃఖం!

కౌసల్యాదేవి భవనమంతా రోదనధ్వనులతో నిండిపోయి ఉంది.

సుమిత్రాదేవి ఈ ఏడుపులు పెడబొబ్బలు చూసింది!

ఏమైందని ఏడుస్తున్నారు మీరంతా! రాముడంటే ఎవరనుకున్నారు?

పురుషులలో శ్రేష్ఠుడు, సకలసద్గుణసంపన్నుడు, మహాబలశాలి,

అతడు అనుసరించేది ధర్మమార్గం. ఆ మార్గంలో స్థిరంగా నిలిచి వున్నవాడి గురించి ఆందోళన ఎందుకు?

అన్నతోటి లక్ష్మణుడున్నాడు, సీత కూడా అరణ్యవాసంలోని కష్టాలన్నీ తెలిసే స్వయంగా వెళ్ళింది.

రాముడు ధర్మమూర్తి.

ఆయనను సూర్యుడు తనకిరణములతో బాధింపడు, వాయువు ఆయన శరీరాన్ని ఎప్పుడూ ఆహ్లాదకరంగానే తాకుతుంది.

రాత్రిపూట నిద్రించే రామునికి చంద్రుడి కిరణస్పర్శ ఆయన కన్న తండ్రి స్పర్శ అంత ఆనందంగా వుంటుంది.

లోకంలో అలాంటి వీరుడింకొకడు లేడు. అంతటి మహావీరుడు అరణ్యంలో కూడా సొంత ఇంట్లో ఉన్నట్లు ఉండగలడు!

రాముడి యందు లక్ష్మి, శౌర్యము, మంగళప్రదమైన బలం ఉన్నాయి. అరణ్యవాసాన్ని ఏ విధమైన శ్రమలేకుండా పూర్తిచేసుకుని హాయిగా తిరిగివస్తాడు.

ఓ కౌసల్యా!

రాముడెవరనుకున్నావు?

సూర్యుడికి సూర్యుడు, అగ్నికి అగ్ని, ప్రభువులకు ప్రభువు, సంపదలకు సంపద, కీర్తికి శ్రేష్టమైన కీర్తి, ఓర్పుకు ఓర్పు, దేవతలకు దేవత, సకల భూతములకు భూతశ్రేష్ఠుడు, అనన్యసామాన్యం, అనితరసాధ్యం అయిన సామర్థ్యం కలవాడు!

అట్టి రాముడు అరణ్యంలో ఉంటేనేమి? అయోధ్యలో ఉంటేనేమి? ఎక్కడైనా ఒకటే ఆయనకు!

ఓ కౌసల్యా! రాముడు తిరిగి వచ్చి నీ పాదాలకు నమస్కరించి రాజ్యలక్ష్మితో, సీతాలక్ష్మితో, మహాలక్ష్మితో అత్యంత వైభవంగా ఉండటాన్ని నీవు కనులారా కాంచుతావు!

ఏడవకు, ఏడవకు

రామ మాతా ఏడవకు!

రాబోయే రోజులలో రాముడే అయోధ్యకు ఏడుగడ!

రాముడి గురించి సంపూర్ణంగా తెలుసుకొన్న మహాతపస్విని సుమిత్రా మాత! అందుకే మారుమాటాడకుండా చిరునవ్వుతో కొడుకును రామునివెంట పంపింది. రాముడి సామర్థ్యం తెలిసి విలపించకుండా ప్రశాంతంగా ఉన్న ధీరోదాత్తురాలైన వనిత సుమిత్రాదేవి.

రామా! ఇంక నీవు ముందుకు వెళ్ళవలదు అన్నట్లుగా తమసా నది అడ్డం వచ్చింది.

అప్పటికే లోకాలను తమస్సులు(చీకట్లు) కప్పివేశాయి!.

అది వనమందు వారికి మొదటిరాత్రి, ఆ అరణ్యమంతా కూడా నిశ్శబ్దరోదనం చేస్తున్నట్లుగా ఉంది.

లక్ష్మణా ఇది మనకు వనవాసపు తొలి రాత్రి!

నా మనస్సు చాలా ప్రశాంతంగా ఉంది.

సకలసద్గుణ సంపన్నుడైన భరతుడి రక్షణలో మన తల్లితండ్రులకు ఏవిధమైన కొరత కూడా రాదు.

అతడు వారిని తన అమృతహృదయంతో దుఃఖం నుండి ఓదార్చగలడు. లక్ష్మణా నన్ను అనుసరించి నీవు నాకు ఎంతో సహాయం చేశావు. సీతను రక్షించుకోవాలికదా! (ఇది మొదటిరోజే ఆయన నోట వెలువడిన మాట).

లక్ష్మణా నేడు మన దీక్ష ప్రారంభం కావున రాత్రికి నేను మంచినీరు మాత్రమే త్రాగి ఉండగలను. ఈ వనంలో ఫలాలు సమృద్ధిగానే ఉన్నాయి. అయినా నాకు ఇట్లా ఉండటమే ఇష్టం.

నీవు గుర్రాల సంగతి చూసుకో అని సుమంత్రుని ఆదేశించగా, అతడు వాటికి పచ్చగడ్డి వేసి నీరు త్రాగించి అవి సుఖంగా విశ్రాంతి తీసుకొనే విధంగా ఏర్పాటు చేశాడు.



తదుపరి సుమంత్రుడు సంధ్యోపాసనం పూర్తిచేసి సీతా, రామ, లక్ష్మణులకు చెట్ల ఆకులతో పక్కలు ఏర్పాటు చేయగా సీతారాములిరువురూ శయనించారు. రాజాంతఃపురం బయట పట్టుపరుపులు లేకుండా నిదురించిన తొలిరాత్రి సీతమ్మకు.

లక్ష్మణునకు నిదురపట్టలేదు! తెల్లవార్లూ సుమంత్రుడితో రాముడి గురించే కబుర్లు చెపుతూ కాలక్షేపం చేశాడు.

వారి వెంట వచ్చిన పురజనులంతా చెట్టుకొకరు, పుట్టకొకరుగా ఎవరికి అనుకూలంగా ఉండే స్థలంలో వారు నిద్రించారు.

అది తెల్లవారుఝాము మూడుగంటల ప్రాంతం, రాముడు నిదుర లేచి వారందరినీ ప్రేమగా చూసి లక్ష్మణునికి చూపుతూ, లక్ష్మణా! వీరంతా ప్రాణాలు విడుస్తారు కానీ.. మనలను విడువరు, వీరెవరూ లేవక ముందే మనం ఈ ప్రదేశాన్ని విడిచి వెళ్ళటం మంచిది.

ఆలోచన వచ్చినదే తడవుగా సుమంత్రుని రథం సిద్ధం చేయమని చెప్పి కొంతదూరం అయోధ్య వైపు వెళ్ళినట్లుగా వెళ్ళి మరల ఇంకొక దారిలో పయనించి ఆ చీకట్లలోనే తమసా నదిని దాటి ఆవలవైపుకు చేరి ప్రయాణం చేయసాగారు.

తెల్లవారేసరికి తమ దేశపు సరిహద్దులు దాటారు.

తెల్లవారగనే జనులంతా మేల్కొని రథం అయోధ్యవైపు వెళ్లినట్లుగా గుర్తులను బట్టి తెలుసుకొని వెనుకకు మరిలారు.

అయోధ్య చేరిన తరువాతగానీ వారికి అర్థం కాలేదు రాముడే ఉద్దేశ్యపూర్వకంగా తమను మరల్చినాడని. రాముని తిరిగి తీసుకురాలేని దద్దమ్మలని ఊరూవాడా వారిని ఆడిపోసుకొంది. ..(సశేషం)

# మూడో ప్రపంచ యుద్ధానికి సంకేతాలు

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం వ్యూహాత్మకంగా కలిసి పనిచేశాయి. మిత్రదేశమైన అమెరికాకు కూడా తెలియకుండా ఇజ్రాయెల్... ఇరాన్‌కు ఆయుధాలు అందించింది. గల్ఫ్ యుద్ధం రకరకాల మలుపులు తిరిగి ఆఖరుకు సద్దాం హుసేన్‌ను ఉరి తీసిన తర్వాత రెండు దేశాలకు ఉమ్మడి శత్రువు లేకపోవడంతో సైద్ధాంతిక విభేదాలు మళ్లీ మొదలయ్యాయి. ఈ విభేదాల్లో రెండు దేశాల మధ్య తీవ్ర శత్రుత్వానికి పాలస్తీనాయే కారణం.

## హమాస్ దాడి తర్వాత పెరిగిన ఉద్రిక్తతలు!

పాలస్తీనాకు చెందిన హమాస్ ఉగ్రవాదులు గత ఏడాది అక్టోబరులో ఇజ్రాయెల్‌పై అనూహ్యంగా విరుచుకుపడి ఇజ్రాయెల్ పౌరులను బందీలుగా పట్టుకెళ్లిన తర్వాత ఈ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. దీంతో ఇజ్రాయెల్ హమాస్‌పై పూర్తిస్థాయి దాడులకు దిగింది. గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడింది. తన శత్రువులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా వెదికి వెదికి మట్టుపెట్టే చరిత్ర ఇజ్రాయెల్‌కు ఉంది. హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ శత్రుదేశం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఉన్నాడని తెలుసుకుని అక్కడే మట్టుబెట్టింది. పాలస్తీనాకు అనుకూలంగా ఉండే మరో ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లా లెబనాన్ వైపు నుంచి ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడి చేయడంతో ఆ సంస్థపై విరుచుకుపడింది. ఆ సంస్థ అధిపతి నస్రుల్లాను అంతమొందించింది. ఈ రెండు సంస్థలకు అన్నివిధాలా అండదండలు అందించే ఇరాన్ అగ్ర కమాండర్లను కూడా ఇజ్రాయెల్ హతమార్చింది.

## విరుచుకు పడ్డ ఇరాన్!

ఈ పరిణామాలతో ఇరాన్ అగ్గిమీద గుగ్గిలమై ఇజ్రాయెల్‌పై మంగళవారం రాత్రి దాదాపు 200 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. అయితే ఇజ్రాయెల్ వద్ద శత్రు దుర్భేద్యమైన రక్షణ కవచం ఉండడంతో చాలా క్షిపణులను లక్ష్యాలను తాకకుండానే పేల్చేసింది.

తమపై దాడికి ఇరాన్ కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్వయంగా చేసిన హెచ్చరికతో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో అన్న ఆందోళన ఇప్పుడు సర్వత్రా వ్యక్తమువుతోంది. ఇరాన్ అణు స్థావరాలు, విద్యుత్ కేంద్రాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేయవచ్చనే మాట వినిపిస్తోంది. ఇరాన్ అగ్రనేత ఖొమేనీని లక్ష్యంగా చేసుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ పోరు మరింత విస్తరించి ప్రాంతీయ యుద్ధంగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకోవద్దని జీ7 దేశాల వేదికగా గతంలో అమెరికా విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే.

## భారత్ వాణిజ్యంపై ప్రభావం!

ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు వాణిజ్యపరంగా చాలా దేశాలపై ప్రభావం చూపిస్తాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. భారత్‌పై ఈ ప్రభావం గణనీయంగానే ఉంటుంది. పశ్చిమాసియా దేశాలకు భారత్ నుంచి ప్రధానంగా బాస్మతి బియ్యం, వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, పత్తి ఎగుమతి అవుతుంటాయి. ఈ దేశాల నుంచి పెట్రోలియం ఉత్పత్తులు, రసాయనాలు భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియా దేశాల్లో ఇజ్రాయెల్ భారత్‌కు ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంది. చమురు విషయానికి వస్తే ఇటీవల కాలంలో రష్యా నుంచి చమురు ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నా ఇరాన్ నుంచి కూడా అధికంగానే చమురు దిగుమతి అవుతోంది. ఇప్పుడు యుద్ధంలో ఇరాన్ నేరుగా దిగడం వల్ల ఆ ప్రభావం మన దిగుమతులపై ఉంటుంది. చమురు, ఎలక్ట్రానిక్స్, వ్యవసాయం వంటి రంగాల్లో వాణిజ్యానికి నష్టంతో పాటు రవాణా ఖర్చులు పెరుగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఒక వేళ ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించినా, ఇరాన్ ఇంధన స్థావరాలపై ఇజ్రాయెల్ దాడి చేసినా ముడిచమురు ధర మరింత పెరుగుతుంది. ఎగుమతులు,దిగుమతులకు హోర్ముజ్ జలసంధి కీలకమైన రవాణా మార్గం. ఈ మార్గం మూతపడి సరఫరాకు అంతరాయం కలిగితే వాణిజ్యపరంగా తీవ్ర నష్టాలు ఏర్పడి చమురు సహా అన్ని వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉంది.

## విమానయానంపై కూడా ప్రభావం!

యుద్ధమేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో పశ్చిమాసియా గగనతలంపై నుంచి రాకపోకలు సాగించే అంతర్జాతీయ విమానాల రాకపోకలకు ఇప్పటికే తీవ్ర అంతరాయం ఏర్పడింది. విమానయాన సంస్థల షేర్లు పడిపోయాయి. దుబాయి, కువైట్, లెబనాన్, ఇజ్రాయెల్‌లో విమానాల ప్రయాణాల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. పలు విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఎయిర్ లైన్స్ ప్రయాణ మార్గాన్ని మార్చుకున్నాయి.

## రాజీ చర్చలు అత్యవసరం!

పశ్చిమాసియాలోని ప్రాంతీయ యుద్ధం మూడో ప్రపంచ యుద్ధంగా మారుతుందా అనే అంశంపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఎక్స్‌లో మూడో ప్రపంచ యుద్ధం అంశంపై చర్చ నడుస్తోంది. హ్యాష్‌ట్యాగ్ వరల్డ్ వార్-3 అంశం భారత్‌లో ఎక్స్ మాధ్యమంలో 5 గంటల పాటు టాప్-3 ట్రెండింగ్ అంశాల్లో ఒకటిగా కనిపిస్తోంది. అసలు ఈ ఊహే వెన్నులో వణుకు పుట్టిస్తోంది. రెండో ప్రపంచ యుద్ధం తాలూకు విధ్వంసాన్ని ఇంకా ప్రపంచం మరవలేదు. మరో ప్రపంచ యుద్ధానికి మానవాళి సిద్ధంగా లేదు. ఈ విషయాన్ని పాలకులందరూ గమనించాలి. యుద్ధం తర్వాత శాంతి ఎలాగూ వస్తుంది. కానీ యుద్ధం తాలూకా నష్టం నీడలో నెలకొనే శాంతి జీవం లేనిదే. అందుకే యుద్ధమే లేని శాంతి అత్యవసరం. దౌత్యమే ఇందుకు సరైన మార్గం. ఉక్రెయిన్ పర్యటన సందర్భంగా భారత ప్రధాని మోదీ ఒక విలువైన మాట చెప్పారు. భారత్ తటస్థంగా ఉండదని, శాంతి వైపు ఉంటుందని స్పష్టం చేశారు. అందుకు దౌత్యమార్గమే శరణ్యం. ఈ ఉద్రిక్త సమయంలో ప్రపంచ దేశాలు తప్పెవరిది అన్న లెక్క వదిలి ఏదో ఒక దేశం వైపు మొగ్గు చూపకుండా, తటస్థంగానూ ఉండిపోక రాజీ చర్చలకు, శాంతి చర్చలకు చొరవ తీసుకోవడం ప్రపంచానికి శ్రేయస్కరం..!

# శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో నవరాత్రి వేడుకలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 50వ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 3వ తేదీ గురువారం ఉదయం కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. వేలాదిమంది భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 4న శ్రీ భవాని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. 5న గాయత్రి అలంకారం, 6న అన్నపూర్ణాదేవి, 7న గజలక్ష్మి, 8న కాళికాదేవి, 9న సరస్వతిదేవి అలంకారాలుంటాయి. 10వ తేదీ దుర్గాష్టమినాడు అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణలతో శ్రీ దుర్గాదేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. 11న శ్రీ మహిషాసురమర్దిని అలంకారం, రాత్రి 7.45 నుండి 8 గంటల వరకు మహర్నవమి(పూర్ణాహుతి), అనంతరం రాత్రి 10.30 నుంచి 11.15 వరకు సుహాసిని పూజల తర్వాత, 11.20 గంటల లోగా కలశోద్వాసన చేస్తారు. తెల్లారితే, 12వ తేది శనివారం ఆశ్వయుజ శుద్ధ విజయదశమి రోజున అమ్మవారి ఆలయం మరింత శోభాయమానంగా ఉంటుంది. ప్రత్యేక అలంకరణలతో అమ్మవారికి పూజలు సేవలు జరుగుతాయి. లలితా కుంకుమార్చన, మహాన్యాసం, శమీపూజ, పారువేట వేడుకగా నిర్వహిస్తారు. అనంతరం జరిగే అమ్మవారి నగరోత్సవం మరింత వైభవంగా ఉంటుంది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈసారి మరింత వేడుకగా అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ రత్నం జయరామ్, ఇఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీవారి సారధ్యంలో భక్తబృందాల వారు, అందరూ కలిసి అమ్మవారి ఉత్సవాలను దిగ్విజయంగా నిర్వహిస్తుండడంతో ఆలయం భక్తజనులతో క్రిక్కిరిసిపోతోంది. వేకువ నుంచి అర్ధరాత్రి దాకా తరలివస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# పల్లిపాడులో కలెక్టర్



గాంధీజీ జయంతి సందర్భంగా పల్లిపాడులోని మహాత్మాగాంధీ ఆశ్రమంలో ఘనంగా వేడుకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ ఆనంద్ పాల్గొని గాంధీజీ విగ్రహానికి, స్వాతంత్ర్యయోధురాలు పొణకా కనకమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమంలో నూలురాట్నం వడికారు. ఇలాంటి గొప్ప చారిత్రక ప్రాశస్త్యం గల ఆశ్రమం మన జిల్లాలో ఉండడం మనకెంతో గర్వకారణమని, ఆశ్రమంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై దృష్టి పెట్టామని కలెక్టర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి ఆశ్రమ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం దేశభక్తి ఉట్టిపడేలా సాగిన విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. గాంధీ వేషధారణలతో విద్యార్థులు కలెక్టర్‌తో ఫోటోలు దిగారు. నెల్లూరు సిటీలోని నగరవనం, సైన్స్ పార్క్, మ్యూజియం, పల్లిపాడు గాంధీ ఆశ్రమాన్ని అనుసంధానిస్తూ ఒక విహారయాత్రను కూడా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ చెప్పారు. విద్యార్థులు వీటిని సందర్శించి, చారిత్రాత్మక, విజ్ఞాన విషయాలు తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# భజన గీతాలతో ఆకట్టుకున్న.. 'భక్తిరంజని'



నెల్లూరులోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సభ, శ్రీ గురుకృప సంగీత విద్యాలయం, గానం అకాడమీ విద్యార్థినీ విద్యార్థులతో ఈనెల 2న నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన 'భక్తిరంజని-భజనమంజరి' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. శ్రీ గురుకృప సంగీత విద్యాలయం వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంగీతజ్ఞురాలు ఏ. లక్ష్మీప్రసన్న నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేకమంది విద్యార్థులు వీనులవిందైన గాత్రంతో ఆ భగంతుని నామసంకీర్తన చేస్తూ శ్రోతలను భక్తిభావ సమన్వితులను చేశారు. చిన్నారులు పాడిన భక్తిపాటలు, వాగ్గేయకారుల కీర్తనలు శ్రవణానందకరం చేశాయి. ప్రముఖ ఆధ్యాత్మిక సారస్వతవేత్త డా. గిరిజాలక్ష్మి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ, ఆ భక్తిగీతాల మాధుర్యాన్ని వివరించారు. దాదాపు మూడున్నర గంటలపాటు జరిగిన ఈ భక్తి కార్యక్రమం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం సభను నిర్వహించారు. ఆర్టీఓ మలోల, ఆదిశంకర విద్యాసంస్థల ఛైర్మన్ వంకి పెంచలయ్య, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వెంకటరవికుమార్, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం అధ్యక్షులు కోట గురుబ్రహ్మం, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొని సంగీత కళాకారులందరినీ అభినందించారు.

# ఎన్‌బికెఆర్‌లో ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ




ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ప్రమాదకరమని, మానవాళికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. నానాటికీ పెరిగిపోతున్న ప్లాస్టిక్ మీద అవగాహన కల్పిస్తూ జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగించారు. హెచ్‌ఓడీ డాక్టర్ సి రవీంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డాక్టర్ సి.ఉదయ్‌కుమార్ రాజు, డాక్టర్ వి.హరికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛతా హి సేవ'...

గాంధీ జయంతి సందర్భంగా అక్టోబరు 2న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి, ఆర్మీ, నేవీ క్యాడెట్లు విద్యానగర్ కూడలిలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తూ ప్రకాశం కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రరెడ్డి, లెఫ్టినెంట్ గోవిందు మాధవయ్య, సబ్ లెఫ్టినెంట్ వి. మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ల తనిఖీ

నెల్లూరులోని ఈవీఎం గోడౌన్లను జిల్లా కలెక్టర్ ఆనంద్ తనిఖీ చేశారు. గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఇటీవల ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గోడౌన్లను రాజకీయపార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

# బట్టేపాడు విద్యార్థినులు.. రాష్ట్రస్థాయి కబడ్డీకి

ఆత్మకూరు మండలం బట్టేపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సీహెచ్ రాణి (అండర్-17), షేక్ హసీనా (అండర్-14)లు త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక య్యారు. స్కూల్ హెడ్మాస్టర్ పెంచలయ్య, పీడీ వెంకటకృష్ణయ్యలు ఈ సందర్భంగా వారిని అభినందించారు.

## పోలీసు క్వార్టర్స్‌లో 'స్వచ్ఛతా హి సేవ'



నెల్లూరు మూలాపేటలోని పోలీస్ క్వార్టర్స్‌లో ఇటీవల 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమం చేపట్టి, పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో, పోలీసు సిబ్బంది పాల్గొని చెత్తాచెదారాన్నంతా ఏరివేసి, ఆ ప్రాంతాన్నంతా శుభ్రం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని చెప్పారు. అనంతరం, పోలీసు కుటుంబాల వారి సమస్యలు విన్న ఎస్పీ, త్వరలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, నగర డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, ఆర్‌ఐలు అంకమరావు, హరి బాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

### అష్టలక్ష్మి అమ్మవారి మందిరంలో..

## నవరాత్రి వేడుకలు

నెల్లూరులోని కొండాయపాళెంగేటు ఎదురుగా ఉన్న శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి మందిరంలో అక్టోబరు 3 నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞానబోధ ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో భాగంగా 3న గౌరీదేవి, 4న విజయలక్ష్మీదేవి అలంకారాలు కన్నులపండువగా నిర్వహించి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. అదేవిధంగా 5న దుర్గాదేవి, 6న మీనాక్షిదేవి, 7న ధనలక్ష్మి, 8న విజయలక్ష్మి, 9న సరస్వతిదేవి, 10న చండీదేవి, 11న మహిషాసురమర్ధిని అలంకారాలు నిర్వహించి, 12న పూర్ణకళ, శ్రీ రాజ రాజేశ్వరిదేవి అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టు సభ్యులు కోరారు.

## నవరసాలను పండించే.. జానపదాలు

### ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి



జానపదాలు నవరసాలను పండిస్తాయని, అత్యద్భుతమైన జానపద గీతాలు, కళారూపాలు నేటికీ తమ వైభవాన్ని చాటుకుంటూనే ఉన్నాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డా. చిగిచెర్ల కృష్ణారెడ్డి అన్నారు. సెప్టెంబరు 29, చెన్నైలోని వేద విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో టీనగర్ ఆంధ్రాక్లబ్ కృష్ణాహాల్‌లో జరిగిన 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారవాహికలో ఆయన పాల్గొని 'జానపద భాషా వైభవం' అనే అంశంపై ప్రసంగించారు. చిత్తూరుజిల్లాలో మహాభారతం ఉత్సవాల వీధినాటికలు, కడపలో చెక్కభజనలు, అనంతపురం జిల్లాలో కోలాటం వంటి ప్రసిద్ధమైన ఎన్నో రకాల జానపద కళారూపాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. తొలుత వేద విజ్ఞానవేదిక అధ్యక్షులు జెకె రెడ్డి ప్రార్థనాగీతం ఆలపించి సభను అలరించారు. ఈ సందర్భంగా ఆయన ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి జానపద వాఙ్మయానికి చేస్తున్న అపారమైన సేవలను వివరించారు. జానపద సాహిత్యంపై 15 గ్రంథాలు, 61 పరిశోధనలు చేయడమే కాక, డా.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 2వేలకు పైగానే జానపద కళాప్రదర్శనలు జరిగాయని, వైఎస్సార్ జీవితసాఫల్య పురస్కారంతో పాటు 'జానపద కళారత్న' వంటి గొప్ప బిరుదులు కూడా ఆయన పొందారని వివరించారు. వేదిక కార్యదర్శి కందనూరు మధు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం సాహిత్యాభిమానులను బాగా ఆకట్టుకుంది.

### శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు..

## 'బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్' అవార్డు



'ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్'గా శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్ అవార్డు అందుకుంది. ఇక్కడ అమలుచేస్తున్న ఉత్తమ ఆతిధ్య సేవలకు ఈ విశిష్టమైన గుర్తింపు దక్కింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టూరిజం శాఖ వారు 2023-2024 సంవత్సరానికి ఆ అవార్డును శ్రీసిటీకి బహుకరించారు. ఏపీ ప్రభుత్వ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం-సాంస్కృతిక శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ సీఈవో ఎం.అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్ జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు ఇటీవల అవార్డును స్వీకరించారు. శ్రీసిటీలోని సువిశాల ప్రాంతంలో ఉన్న మ్యాంగో రిసార్ట్ 20 లగ్జరీ కాటేజీలు, 10 సాధారణ గదులతో ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఇక్కడ బస చేసే అతిథులు రమణీయమైన ప్రకృతి సోయగాలను సందర్శించడంతో పాటు కయాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పక్షులను వీక్షించడం వంటి వాటిని ఆస్వాదించవచ్చు. ఇక్కడ అత్యంత ఆధునిక వసతులతో పాటు, అంతర్జాతీయస్థాయి సందర్శకుల అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన పలు రకాల వంటకాలు కూడా అందుబాటులో ఉంటాయి.

### మాండెలెజ్, శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

## ప్రభుత్వ పాఠశాలలకు డస్ట్‌బిన్లు



శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా సెప్టెంబరు 30న శ్రీసిటీలోని మాండెలెజ్ పరిశ్రమ శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సుమారు లక్ష రూపాయల విలువైన డస్ట్‌బిన్‌లను పంపిణీ చేసింది. విద్యార్థులలో పరిశుభ్రతతో పాటు, పరిసరాల్లో వ్యర్థ పదార్థాల తొలగింపు ప్రాముఖ్యత పట్ల అవగాహన కల్పించారు. దీంతో పాటు సేంద్రియ వ్యర్థాలను గుంతలలో నిక్షిప్తం చేసి, వాటిని సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియను శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ద్వారా నేర్పించారు. ఈ ఆచరణాత్మక విధానం వ్యర్థాల నిర్వహణతో పాటు రీసైక్లింగ్, కంపోస్ట్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాండెలెజ్ పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ రవళి, శ్రీసిటీ సిఎస్ఆర్ మేనేజర్ నిరీషా సన్నారెడ్డి, మాండెలెజ్‌కు చెందిన వెంకన్న, అమన్, ఇరుగుళం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మొహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమనసు చాటుకున్న చిన్నారులు

- వరద బాధితులకు రూ. 54వేల విరాళం



వారు చిన్నారులే అయినా తమ పెద్దమనసు చాటుకున్నారు. తాము దాచుకున్న డబ్బును వరద బాధితుల సహాయార్థం విరాళంగా ఇచ్చి తమ మానవతను నిరూపించుకున్నారు. తోటపల్లి గూడూరు మండలం చెన్నపల్లిపాళెం హైస్కూలు విద్యార్థులు వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధికి 54,161 రూపాయల విరాళాన్ని డీడీ రూపంలో ఇటీవల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అందజేశారు. ఆ చిన్నారుల ఔదార్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. వరద బాధితులను ఆదుకునే విషయంలో అందరూ ఈ చిన్నారులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు వీరబోయిన గంగాధర్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు సీ.హెచ్.వి ఫణికుమార్, వి.నళిని, ఎస్.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నరసింహకొండ ఆలయం ఇఓగా..వేమూరి గోపి



నెల్లూరు రూరల్ మండలం నరసింహ కొండపై వెలసివున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం కార్యనిర్వహణాధికారిగా వేమూరి గోపి నియమితులయ్యారు. ఇటీవల ఆయన కాలినడకన కొండపైకి వెళ్ళి స్వామి వారికి, అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఆలయ ఇన్‌చార్జి ఇఓ ఎం.సుధీర్ నుంచి ఇఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, అప్పలాచార్యులు, మురళీధరాచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### సోమశిలలో పెరిగిన నీటి నిల్వ

సోమశిల రిజర్వాయర్‌లో ఈనెల 1వ తేదీకల్లా నీటిమట్టం 53.667 టీఎంసీలకు చేరుకుంది. ఈ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు. ఎగువప్రాంతాల నుంచి 6,116 క్యూసెక్కుల వరదనీరు జలాశయానికి చేరడంతో, దిగువ డెల్టాకు వెయ్యి క్యూసెక్కులు, కండలేరుకు 10వేలు, ఉత్తరకాలువకు 540, దక్షిణ కాలువకు 4 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

### చేజర్ల విద్యార్థి.. మధురై వద్ద దుర్మరణం

ఈనెల 1న జరిగిన రోడ్డ ప్రమాదంలో నెల్లూరుజిల్లా చేజర్ల మండలం బోడిపాడుకు చెందిన చందు అనే బీటెక్ విద్యార్థి రోడ్డుప్రమాదంలో మరణించాడు. మధురైలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకుంటున్న చందు, తన స్నేహితునితో కలసి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యంలో కారు ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం.

### నల్లగొండ్ల విద్యార్థులకు విద్యాసామగ్రి

వింజమూరు మండలం నల్లగొండ్ల ప్రాథమిక పాఠశాలకు సర్పంచ్ అన్నపురెడ్డి ప్రమీల-వెంగళరెడ్డి దంపతులు ఇటీవల విద్యార్థులకు విద్యాసామగ్రిని, కార్యాలయానికి ఒక బీరువా, ఆఫీస్ టేబుల్‌ను తమ వితరణగా అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అరుణ, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### కందుకూరులో మహిళకు రక్తదానం

కందుకూరు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న ఓ మహిళ పరిస్థితి విషమంగా తయారై, ఆమెకు వెంటనే ఏ-ప్లస్ పాజిటివ్ గ్రూప్ రక్తం ఎక్కించాలని డాక్టర్లు చెప్పడంతో, ఆ సమాచారం తెలుసుకున్న స్థానికుడు పబ్బిశెట్టి వరదరాజు స్పందించి రక్త దానం చేశాడు. దాంతో ఆ మహిళ ప్రాణాలు నిలబడడంతో, రక్తమిచ్చి ఆదుకున్న ఆ రక్తదాతను స్థానికులు అభినందించారు.

### కృష్ణపట్నం విద్యార్థులకు అదాని ఫౌండేషన్ సాయం

ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలోని జడ్పీహైస్కూలులో 10వ తరగతి విద్యార్థులకు తెలుగుమీడియంలో అవసరమైన మెటీరియల్‌ను ఆదాని ఫౌండేషన్ వారు ఈనెల 1న పంపిణీ చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు రాజేష్‌రంజన్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని సరళ తదితరులు పాల్గొన్నారు.

### ఉదయగిరి 'భవిత' కేంద్రాన్ని పరిశీలించిన ఎంఇఓ

ఉదయగిరి దళితవాడలోని పాఠశాలలో నెలకొల్పిన 'భవిత' కేంద్రాన్ని ఇటీవల మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు డిజిటల్ విద్య ఎలా బోధిస్తున్నారో ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వావిళ్లలో ఉచిత వైద్యశిబిరం

విడవలూరు మండలం వావిళ్ళ జడ్పీ ఉన్నతపాఠశాలలో ఇటీవల నెల్లూరులోని బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నరాల బలహీనత, మూర్ఛ వ్యాధి వంటివాటిపై డాక్టర్ బిందుమీనన్ గ్రామస్తులకు అవగాహన కలిగించారు. పేదలకు వైద్యపరీక్షలుచేసి, ఉచితంగా మందులిచ్చారు. మాజీ ఎంపీటీసి ఏటూరు హరిరెడ్డి పాల్గొన్నారు.

### నరుకూరులో.. త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తోటపల్లిగూడూరు మండలం నరుకూరు గ్రామంలో ఇటీవల త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించి, గ్రామస్తులకు భగవద్గీత ప్రాముఖ్యతను వివరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి నెల్లూరు కమిటీ ప్రతినిధులు సురమౌళి, రామయ్య, విజయమ్మ, ధనలక్ష్మి, మనోజ్, సిహెచ్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### లింగనపాళెం వద్ద ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కొండాపురం మండలం లింగనపాళెం వద్ద మిడతవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్న నాలుగు ట్రాక్టర్లను ఇటీవల పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మహేంద్ర ఆ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

# శ్రద్ధాంజలి



జననం : 27.07.1947 నిర్యాణం : 25.09.2024

మానవీయ మనసున్న మహనీయురాలు,
విద్యాదాత.. సేవే శ్వాసగా జీవించిన నేత,
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ పురోభివృద్ధికి నిరంతరం తపించిన
విద్యాలయ కమిటీ కార్యవర్గ సభ్యురాలు

## శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారి

సేవలను స్మరించుకుంటూ... మా శ్రద్ధాంజలి.

**జి.వి.కె.రెడ్డి,** ఛైర్మన్

**దొడ్ల శేషారెడ్డి**
సెక్రటరీ & కరస్పాండెంట్

మరియు **కార్యవర్గ సభ్యులు**
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ కమిటీ, నెల్లూరు.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com